



రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద భద్రతా బలగాలు

నేడు అన్నదాత సుఖీభవ

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అర్హులైన 1,14,991 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ 21 విడత కింద ఆర్థిక సహాయాన్ని నేరుగా రైతుల ఖాతాకు జమ చేస్తారని కలెక్టర్ కీర్తి చేకూరి మంగళవారం తెలిపారు. దేశవ్యాప్తంగా బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ కోయంబత్తూర్ నుంచి, కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం చినదాసరపల్లి నుంచి సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారన్నారు.

హెచ్‌ఎం అకౌంట్ టెస్ట్‌కి దరఖాస్తులు స్వీకరణ

రాజమహేంద్రవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పని చేస్తున్న అర్హత కలిగిన ఉపాధ్యాయులకు నిర్వహించే హెచ్‌ఎం అకౌంట్ టెస్ట్‌కి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని డీఎస్ఈవో వాసు దేవరావు తెలిపారు. రెండు పేపర్లకు రూ.150, ఒక పేపర్‌కి రూ.100 రుసుంను సీఎఫ్ఎంఎస్ ద్వారా మాత్రమే చెల్లించాలని చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఈ నెల 17 నుంచి అందుబాటులోకి వచ్చిందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

విశాఖలో పెట్టుబడుల సదస్సు గ్రాండ్ సక్సెస్
ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో జరిగిన ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు గ్రాండ్ సక్సెస్ అయ్యిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరానికి కూడా ఏవియేషన్ రంగంలో రూ.100 కోట్ల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై రాష్ట్రంలో ప్రత్యేక దృష్టి పెడుతున్నారన్నారు. బిహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ ముఖ్య నాయకుడు రాహుల్‌గాంధీ ఓటు చోరీ అంటూ చేసిన తప్పుడు ప్రచారాన్ని బిహార్ ప్రజలు పట్టించుకోలేదన్నారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ అత్యంత పకడ్బందీగా ఉన్నపుడు ఓటు చోరీకి ఎక్కడ అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, లక్ష్మీ ప్రసన్న శ్రీదేవి పాల్గొన్నారు.



సత్యసాయి ప్రతినిధులతో మంత్రి దుర్గేష్


రాష్ట్ర పండుగగా సత్యసాయి జయంతి
మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రాష్ట్ర అధికారిక పండుగగా నిర్వహిస్తున్న భగవాన్ శ్రీ సత్యసాయి శతజయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలులోని సత్యసాయిబాబా మందిరంలో మంగళవారం శత జయంతి వేడుకలు ఘనంగా ప్రారంభించారు. బాబా తన ఆధ్యాత్మిక ప్రసంగాలతో అసంఖ్యాక ప్రజానీకానికి స్ఫూర్తి కలిగించి కోట్లాది భక్తుల ఆరాధ్య దైవంగా కీర్తించబడ్డారన్నారు.ఆయన సేవామార్గం అనుసరణీయమన్నారు. రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు, విశాలాక్షి దంపతులు బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో కూటమి నాయకులు,సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేను లేని లోకాన.. మీరూ వద్దు!
బిడ్డలతో సహా గోదారిలో దూకేసిన తండ్రి 6



అడవిలో కలిసిన.. ఆరో ప్రాణం!



రంపచోడవరంలో దట్టమైన అటవీ ప్రాంతం

రాజమండ్రికి 100కి.మీ

ఉమ్మడి జిల్లాలో మావోయిస్టుల ఉనికి లేదనుకున్న తరుణంలో ఒక్కసారిగా భారీ సంఘటన కలకలం రేపింది. పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందడం.. అందులో ఒకరు మూడు రాష్ట్రాలు, కేంద్రం హిట్‌లిస్ట్‌లో ఉన్న మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మా కావడం పెను సంచలనంగా మారింది. అసలు మావోల జాడే లేదనుకున్న మారేడుమిల్లిలో ఏకంగా మావోయిస్టు అగ్రనేత తలదాచుకోవడం.. ఎన్‌కౌంటర్‌లో ఆయనతో పాటు మరో ఆరుగురు మరణించడం కలకలం రేపింది. రాజమహేంద్రవరం నుంచి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం వంద కిలోమీటర్లే కావడంతో విషయం తెలిసి ఉమ్మడి జిల్లా ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మారేడుమిల్లి మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల లోపే ఉండడం గమనార్హం. అదే సమయంలో ప్రశాంత నగరంగా పేరొందిన కాకినాడలో ఇద్దరు మహిళా మావోయిస్టులు పట్టుబడడం, వీరు హిడ్మా గన్‌మెన్‌లు కావడంతో ఉమ్మడి జిల్లా ఒకేరోజు రెండు ఉలిక్కిపడే ఘటనలతో వణికింది.

ఆరుగురు మావోల ఎన్‌కౌంటర్
ఉమ్మడి జిల్లాలో ఉలికిపాటు

అడవిలో మావోయిస్టుల ఆరో ప్రాణం కలిసిపోయింది. ఉమ్మడి జిల్లా వణికింది.. మారేడుమిల్లి పేరు మళ్లీ మార్మోగింది.. ఎన్నో ఏళ్ల తర్వాత మళ్లీ తూటాలు పేలాయి.. ఆరుగురు మావోయిస్టుల ప్రాణాలు గాలిలో కలిశాయి.. పచ్చని చెట్లపై రక్తపు మరకలు పడ్డాయి. చాలా ఏళ్ల కిందట మారేడుమిల్లి అడవులకు వెళ్లాలంటే భయపడేవారు. అటువంటిది మావోయిస్టుల ప్రాభవం తగ్గింది.. దీంతో ఇప్పుడిప్పుడే అడవి అందాలు ఆస్వాదించేందుకు ఏజెన్సీ బాట పడుతున్నారు.. ఆరుగురు మావోల ఎన్‌కౌంటర్‌తో మళ్లీ భయం పెరిగింది.

- (కాకినాడ/మారేడుమిల్లి/రంపచోడవరం-ఆంధ్రజ్యోతి)

మారేడుమిల్లి ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతోంది. పర్యాటకులు ప్రకృతి అందాలు తిలకించేందుకు పోటెత్తుతుంటారు. అయితే ఉన్నట్టుండి ఒక్కసారిగా మంగళవారం ఉదయం ఆరున్నర గంటల సమయంలో తుపాకీ మోతలు.. బుల్లెట్ల శబ్దాలతో ఏం జరుగుతుందో తెలియని భయం నెలకొంది. కానీ ఆ తర్వాత కాసేపటికే ఎన్‌కౌంటర్ జరిగిందని తెలిసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉలిక్కిపడింది.

- మారేడుమిల్లిలో ఘటన
- గత కొన్నేళ్లుగా కానరాని జాడ
- తాజా ఎన్‌కౌంటర్‌తో అలజడి
- పోలీసుల ముమ్మర కూంబింగ్
- రంపచోడవరానికి మృతదేహాలు
- సామర్లకోటలో చిక్కిన మావోలు
- వీరిద్దరు హిడ్మా లేడీ గన్‌మెన్లు?

20 ఏళ్ల కిందట ఒకటి..

ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో మారేడుమిల్లి, వై.రామవరం అడవుల్లో మావోయిస్టుల ప్రాబల్యం ఉండేది. 1987 డిసెంబరు 27న ఏడుగురు ఐఏఎస్ అధికారులను మావోయిస్టులు వై.రామవరంలోని గుర్తేడు అడవుల్లో కిడ్నాప్ చేసిన ఘటన సంచలనంగా మారింది. ఆ తర్వాత మారేడుమిల్లి, వై.రామవరం అడవుల్లో వరుసగా మావోయిస్టులు పలువురిని చంపడం, వరుస కూంబింగ్‌లలో మావోయిస్టులు మరణించడం జరిగేవి. అయితే గడచిన కొన్ని దశాబ్దాలుగా మారేడుమిల్లిలో మావోయిస్టుల జాడే లేదు. మళ్లీ కొన్ని దశాబ్దాల తర్వాత మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరగడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ జరిగిన చోటుకు అతి సమీపంలో 20 ఏళ్ల కిందట ఓ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది.

అడవిని వదిలేసిన మావోలు..

ఛత్తీస్‌గఢ్ నుంచి ఆంధ్రా ప్రాంతంలోని పలు నగరాల్లోకి మావోయిస్టులు పెద్దఎత్తున చొరబడ్డారనే విషయం సంచలనంగా మారింది. ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో మావోయిస్టులకు తగులుతున్న వరుస ఎదురుదెబ్బలతో అక్కడ మనుగడ సాగించలేని పరిస్థితుల్లోనే మావోలు మన ఏజెన్సీని సురక్షిత ప్రాంతంగా ఎన్నుకోవడంతోపాటు ఇక్కడి నెట్‌వర్క్ ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారన్న సమాచారం హడలెత్తిస్తోంది. దీంతో ఆంధ్రాలోకి చొరబడే మార్గాల వెంబడి నిఘాను పెంచి వారి కదలికలను భద్రతా దళాలు గుర్తించినట్టు చెబుతున్నారు. ప్రస్తుతం అడవుల్లో ప్రత్యేక బలగాలతో కూంబింగ్‌లతోనూ, నగరాల్లో ఆక్టోపస్ బలగాలతోనూ పోలీసులు గాలిస్తున్నారు. మావోల కదలికలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

హిడ్మా ఇక్కడకెందుకొచ్చాడు చెప్మా?



మోస్ట్‌వాంటెడ్.. 26 కేసుల్లో నిందితుడిగా ఉన్న మావోయిస్టు హిడ్మా మారేడుమిల్లి అడవులకు రావడమేంటనే ప్రశ్న మొదలైంది. ఎక్కడో ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం అడవుల నుంచి తూర్పు కనుమల్లోని మారేడుమిల్లి అడవులకు రావడం చర్చనీయాంశంగా మారింది. మావోయిస్టు అగ్రనేత మారేడుమిల్లి అడవుల్లో సంచరించడం సంచలనం సృష్టించింది. మరోపక్క కాకినాడకు సమీపంలోని సామర్లకోట మండలం కొప్పవరంలో మంగళవారం మధ్యాహ్నం ఇద్దరు మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేయడం కలకలం రేపింది. వీరిద్దరు చనిపోయిన మావోయిస్టు అగ్రనేత హిడ్మా గన్‌మెన్‌లుగా పోలీసులు గుర్తించినట్టు సమాచారం. వీరు కొప్పవరం వద్ద రహదారి దాటుతుండగా పోలీసులకు చిక్కారు.

అల్లూరి జిల్లా షెల్టర్ జోన్ కానివ్వం




అల్లూరి సీతారామరాజు జిల్లాను మావోయిస్టులకు షెల్టర్‌జోన్ కానివ్వం. ఏపీ సరిహద్దు రాష్ట్రాల్లో ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితుల్లో మావోయిస్టులు అల్లూరి జిల్లాను షెల్టర్ జోన్ చేసుకుని మనుగడ సాధిద్దామనుకుని ఇక్కడకు చొరబడితే తగిన గుణపాఠం చెబుతాం. మావోయిస్టులు ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయారు. వారిని భయపెట్టి ఉద్యమాన్ని సాగించాలనుకున్నా ఎవరూ భయపడడం లేదు. ప్రజల్లో వారికి పెరిగిన వ్యతిరేకతే వారి అంతానికి కారణం. ఇకనైనా ఉద్యమాన్ని వీడి జన జీవన స్రవంతిలో కలవాలనుకునే మావోయిస్టులకు తాము స్వాగతం పలుకుతాం. - అమిత్ బర్దర్, ఎస్పీ

7 నెలలు.. 3 ఎన్‌కౌంటర్లు

(చింతూరు - ఆంధ్రజ్యోతి)

రంపచోడవరం ఏజెన్సీలో ఈ ఏడాది గడచిన ఏడు నెలల్లో మూడు ఎన్‌కౌంటర్లు జరిగాయి. 11 మంది మావోయిస్టులు మృతిచెందారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి, వై.రామవరం మండలాల అడవుల్లో ఇటీవల వరుస ఎన్‌కౌంటర్లతో ఆందోళన నెలకొంది. రంపచోడవరం అడవుల్లో గత దశాబ్దకాలంగా చెప్పుకోదగ్గ ఘటనలేమీ లేవు. ఈ ఏడాది వై.రామవరం మండలం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు.వారిలో ఆంధ్ర ఒడిస్సా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు టకూరి పండన్న అలియాస్ జగన్, ఏవోబీ డివిజన్ కమిటీ సభ్యుడు రమేష్ ఉన్నారు. జూన్‌లో మారేడుమిల్లి మండలం కింటు కుర్రు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి, అలియాస్ ఉదయ్, కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి భార్య రావి వెంకట చైతన్య, కొవ్వాసి అంజు అలియాస్ మాసే ఉన్నారు. ఇక మంగళవారం మారేడుమిల్లి మండలం జీఎం వలస పంచాయతీలోని నెల్లూరు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, సౌత్ బస్తర్ బెటాలియన్ నాయకుడు హిడ్మా అలియాస్ సంతోష్, అతడి భార్య రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాజే అలియాస్ రాజక్క, దేవే, లఖాల్ అలియాస్ చైతు, మల్ల అలియాస్ మల్లాలు, కమ్లు కమలేష్ ఉన్నారు. ఇంతవరకూ జరిగిన ఎన్‌కౌంటర్లలో మృతిచెందిన వారంతా ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దు క్యాడర్ వారే. తాజా ఎన్‌కౌంటర్లో మృతి చెందింది మాత్రం ఛత్తీస్‌గఢ్ క్యాడర్ కావడం విశేషం.



అనంతపల్లిలో దీపోత్సవం

శివ..శివ..శంకర..

నల్లజర్ల/ కడియం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కరుణించు కార్తీక దామోదరా.. శివయ్యా కాపాడయ్యా అంటూ భక్తులు కార్తీక మాసం సందర్భంగా శైవక్షేత్రాలకు క్యూ కడుతున్నారు. ఎక్కడికక్కడ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మాసశివరాత్రిని పురస్కరించుకుని నల్లజర్ల మండలం అనంతపల్లి వేగిలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. వేదపండితుడు గూడూరి రమేష్ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం చేశారు. కడియం మండలం కడియపులంక హరిహర క్షేత్రంలో అనంతేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.



కడియపులంకలో అనంతేశ్వరుడు



నన్నయ వర్శిటీలో నూతన భవనాలు పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి, వీసీ ప్రసన్నశ్రీ

నన్నయ వర్శిటీలో కలెక్టర్ పరిశీలన

రాజమహేంద్రవరం అర్బన్/దివాన్‌చెరువు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నన్నయ వర్శిటీ, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలను మంగళవారం కలెక్టర్ కీర్తి చేకూరి సందర్శించారు. విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల భవనం, పరీక్షల భవనం, కామర్స్‌మేనేజ్మెంట్ స్టడీసఫ్ స్కూల్ భవనాలను పరిశీలించారు. విశ్వవిద్యాలయం నిధులతో నిర్మించిన భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని వీసీ ప్రసన్న శ్రీ తెలిపారు. విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల భవనం రూ.20.05 కోట్లు, పరీక్షల భవనం రూ.8.25 కోట్లు, స్కూల్ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంట్ భవనం రూ.5.50 కోట్లు, బాలుర వసతిగృహ భవనం రూ.11.10 కోట్లతో నిర్మించామని చెప్పారు. అనంతరం విశ్వవిద్యాలచం అభివృద్ధికి, ప్రగతి కార్యాచరణకు సంబంధించిన పలు అంశాలను తెలిపారు. ఆర్ట్స్ కళాశాల అకడమిక్ ప్రగతి, పరిశోధన వాతావరణం, విద్యార్థుల వినూత్న ఆలోచనలకు అనుకూలంగా ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలపై సమీక్షించారు. ముందుగా ఇంక్యుబేషన్, ఇన్నోవేషన్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ బ్లాకులను పరిశీలించారు. విద్యార్థులు అభివృద్ధి చేసిన ప్రాజెక్టులు, స్టార్టప్ ఆలోచనలు, ఇన్నోవేటివ్ నమూనాలను వీక్షించారు. సీవీ రామన్ అంతర్జాతీయ పరిశోధనా కేంద్రం, నానో టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, రీసెర్చ్ ల్యాబ్‌లు, అక్కడ జరుగుతున్న ప్రయోగాలను పరిశీలించారు. కేంపస్ లైబ్రరీ సందర్శించి మార్క్స్, డార్విన్, న్యూటన్ పుస్తకాల సేకరణ, వాటి పరిరక్షణకు సంబంధించిన విషయాలను కళాశాల అధికారులను అడిగి తెలుసుకున్నారు. కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ భరత్ నారాయణ గుప్త ఆర్ట్స్ కళాశాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. మంత్రి లోకేశ్ పర్యటన నేపథ్యంలో హడావుడిగా కలెక్టర్ తిలకించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, ఎన్ఆర్‌సీ కో ఆర్డినేటర్ సంజీవ్, జోన్ 1, 2 ఆర్‌జేడీ పీవీ కృష్ణాజీ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ పర్యటన వాయిదా

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ పర్యటన వాయిదా పడింది.ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరం నగర టీడీపీ కార్యాలయం నుంచి ఒక ప్రకట న విడుదల చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో లోకేశ్ పర్యటించాల్సి ఉంది. అయితే ఈ నెల 20న బిహార్ సీఎంగా నితీష్‌కుమార్ ప్రమాణస్వీకారం చేస్తున్నందున ఆ కార్యక్రమంలో ప్రధాని మోదీతో పాటు నారా లోకేశ్ పాల్గొనాల్సి ఉన్నందున రాజమహేంద్రవరం పర్యటన వాయిదా పడింది.రాజమహేంద్రవరంలో ఆర్ట్స్ కళాశాలలో జరగాల్సిన ప్రారంభోత్సవాలు, విద్యార్థులతో ముఖాముఖి, చెరుకూరిలో జరగాల్సిన నగర్ టీడీపీ సమావేశం, దివాన్‌చెరువు నన్నయ్య యూనివర్శిటీలో జరగాల్సిన కార్యక్రమాలు అన్నీ తాత్కాలికంగా వాయిదాపడ్డాయి. త్వరలో ఈ నారా లోకేశ్ పర్యటన ఉంటుందని నగర టీడీపీ కార్యాలయం స్పష్టం చేసింది.

ఆర్ఎంసీకి కేంద్ర జలసంచాయ్ అవార్డు
కమిషనర్‌కు అవార్డు అందజేసిన కేంద్రమంత్రి



అవార్డుతో కమిషనర్ రాహుల్ మీనా

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన 6వ జాతీయ జల అవార్డులు- 2024లో జల్ సంచాయ్ - జన్ భాగీదారీ విభాగం కింద రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు జాతీయ స్థాయిలో నాల్గో ర్యాంక్ వచ్చింది. ఈ సందర్భంగా మంగళవారం ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి చంద్రకాంత్ రఘునాథ్ పాటిల్ చేతుల మీదుగా అవార్డును కమిషనర్ రాహుల్ మీనా అందుకున్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన జల సంరక్షణ పనులకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం గర్వంగా ఉందని కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ మొత్తం 13,298 నీటి సంరక్షణ పనులు పూర్తిచేసి ఈ ఘనత సాధించిందన్నారు. ఈ కేటగిరి కింద లభించిన అవార్డుకు రూ.2 కోట్లు నగదు పురస్కారం లభిస్తుందన్నారు. నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం, వర్షపు నీటిని ఒడిసి పట్ట డం,భూగర్భజలాల పెంపు అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ఈ విజయం సాధించడమైందని కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఈ మాధవి, ఏఈ వెంకటేష్ పాల్గొన్నారు.

కన్నతండ్రి అకృత్యంపై డీఎస్పీ విచారణ



పెరవలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కన్న తండ్రి అకృత్యంపై డీఎస్పీ మంగళవారం విచారణ చేపట్టారు. పెరవలి మండలంలో ఒక గ్రామానికి చెందిన లారీ డ్రైవ ర్‌కు ముగ్గురు కుమార్తెలు ఉ న్నారు. అయితే గత మూడేళ్లగా పెద్ద కుమార్తె(17)ను భయపెట్టి అత్యాచారానికి పాల్పడుతున్నాడు.ఇటీవల కుమార్తె కదలికల్లో మార్పు గమనించిన తల్లి అనుమానంతో నిలదీసింది.దీంతో అసలు విషయం బయటపడింది.ఈ నేపథ్యంలో భర్తతో గొడవపడి కుమా ర్తెను తీసుకుని పెనుమంట్ర మండలం మార్టేరులోని బంధువుల ఇంటికి వెళ్లిపోయింది.వారి సూచన మేరకు గత శనివారం పెను మంట్ర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆదివారం పెరవలి పోలీస్ స్టేషన్‌కు కేసును ట్రాన్స్‌ఫర్ చేశా రు.ఈ కేసుపై కొవ్వూరు డీఎస్పీ ప్రేమ్‌కుమార్ బాలిక గ్రామానికి వెళ్లి మంగళవారం విచారణ చేపట్టారు.స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడు.



సూర్యుడి.. శుభోదయం!

మంచు తెరల మాటు నుంచి సూర్యుడు ఉదయించాడు. శుభోదయం అంటూ గిరిసీమను మురిపించాడు. అల్లూరి జిల్లా చింతూరు శబరి నది పక్కన రహదారిని ఆనుకుని ఉన్న పొలాల్లో మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో కనిపించిన సూర్యోదయం చిత్రాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- చింతూరు (ఆంధ్రజ్యోతి)



రచనలో మణిమకుటం

- డిజిటల్ ఇండియాలో కాగ్ పాత్రపై విశ్లేషణాత్మక వ్యాసం
- జాతీయ స్థాయిలో తృతీయ బహుమతి, రూ.30వేలు నగదు బహుమతి అందుకున్న మణిశ్రీ





న్యూఢిల్లీలో నగదు ప్రోత్సాహక బహుమతి, ప్రశంసాపత్రం అందుకుంటున్న మణిశ్రీ

అమలాపురం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఇండియాలో కాగ్ పాత్రపై ఇంజనీరింగ్ విద్యార్థిని విత్తనాల మణిశ్రీ అద్భుత విశ్లేషణ చేసి జాతీయ స్థాయిలోమెరిసింది. జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్‌లోని భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో క్యాడ్ అండ్ ఎంఎల్ ఇంజనీరింగ్ విభాగంలోమణిశ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ ఏడాది అక్టోబరులో మై భారత్ పోర్టల్ ద్వారా భారత రాజ్యాంగ నియంత్రణ-లెక్కల పరిశీలనాధికారి (కాగ్) కార్యాలయం ఆధ్వర్యంలో ఆడిట్ దివస్-2025 సందర్భంగా నిర్వహించిన జాతీయస్థాయి ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలో పాల్గొంది. ఆమె విశ్లేషణాత్మక వ్యాసం జాతీయ స్థాయిలో తృతీయ స్థానం దక్కించుకున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు తెలిపారు. మణిశ్రీ రచనలో స్పష్టత, విశ్లేషణాత్మక విధానం, పారదర్శకత-డిజిటల్ పాలనపై సునిశితమైన అవగాహన ప్రతిబింబించాయని జాతీయ నిర్వాహకులు కొనియాడారు.న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఆడిట్ దివస్‌లో మణిశ్రీకి రూ.30వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని కాగ్ పరిశీలనాధికారి కె.సునయ్‌మూర్తి అందజేశారు. మణిశ్రీని ప్రిన్సిపాల్ డాక్టర్ రామారావు, చైర్మన్ బోనం కృష్ణసతీష్, క్యాడ్ అండ్ ఎంఎల్ విభాగాధిపతి జి.విజయకుమారి, అధ్యాపకులు, సహచర విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు.

విపత్తుల సమయంలో...

సామాజిక అవగాహన అవసరం

- ఎన్‌డీఆర్‌ఎఫ్ పదో బెటాలియన్ కమాండెంట్ దిల్‌బాగ్‌సింగ్
- జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఐదురోజులు మాక్ ఎక్సర్‌సైజ్‌లు



లంకలగన్నవరం మాక్‌ఎక్సర్‌సైజ్‌లో మాట్లాడుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ దిల్‌బాగ్‌సింగ్



మాక్‌ఎక్సర్‌సైజ్‌లో భాగంగా సీపీఆర్ చేస్తున్న దృశ్యం

పి.గన్నవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించినప్పుడు ప్రతి వ్యక్తి అతడితో పాటు ఇతరులను సైతం రక్షించుకోవడానికి సామాజిక అవగాహన కలిగి ఉండాలని ఎన్డీఆర్‌ఎఫ్ పదో బెటాలియన్ కమాండెంట్ దిల్‌బాగ్‌సింగ్ సూచించారు. మంగళవారం లంకలగన్నవరంలో ముఖ్యంగా విపత్తులు సంభవించినప్పుడు ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలతో పాటు రెవెన్యూ, పోలీసు, ఫైర్ సిబ్బంది సేవలందిస్తారని తెలిపారు. గోదావరి వరదలు, తుఫాన్‌లు, భూకంపాలు సంభవించినప్పుడు మనల్ని మనం కాపాడుకోవాలని అనే అంశాలపై మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్టు ఆయన చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఐదు రోజుల పాటు మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా స్థానిక ప్రజానీకానికి అవగాహన కల్పించడం జరుగు తుందన్నారు. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా 10 పాఠశాలల్లో విద్యార్థులకు స్కూల్ సేఫ్టీ ప్రో గ్రామ్‌లు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహ శీల్దార్ టీమ్ కమాండర్ ఇన్‌స్పెటర్ రాజేంద్ర కుమార్ సరోజ్, ఎస్ఐ బి.శివకృష్ణ, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఫైర్ ఎస్ఐ పి.శ్రీనివాస్, సర్పంచ్ గనిశెట్టి గంగాభవాని, ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్ ఎక్సర్‌సైజ్ విన్యాసాలు

మాక్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా కమాండెంట్ దిల్‌బాగ్‌సింగ్, టీమ్ కమాండెర్ రాజేంద్ర కుమార్‌సరోజ్ ఆధ్వర్యంలో ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది చేసిన విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత గోదావరి వరదల సమయంలో బోటు తిరగబడితే ఎలా రక్షించాలో చూపించారు. ముఖ్యంగా గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్ ఎలా చెయ్యాలో కళ్లకు కట్టినట్టు వివరించారు. అనంతరం గోదావరి వరదల సమయంలో భారీగా నీరు పోటెత్తినప్పుడు మన చుట్టు ఉన్న (ప్లాస్టిక్ బాటిళ్లు, వెండి కొబ్బరికాయలు, ఇనుప డబ్బాలు, తదితర వస్తువులు) వస్తువులతో మనల్ని మనం ఎలా కాపాడుకోవాలో గోదావరి నదిలో చేసి చూపించారు.

రాష్ట్ర వాలీబాల్, టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక



వాలీబాల్ పోటీలకు ఎంపికైన మునిపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు



రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్‌కు ఎంపికైన విద్యార్థులు

ఉప్పలగుప్తం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం మండలం మునిపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు సీహెచ్ హెప్సీబా, ఎం.కావ్యశ్రీ, ఎం.పావని అండర్-14 వాలీబాల్ విభాగంలో సత్తా చాటారు. ఈ మేరకు మంగళవారం ఆ పాఠశాల హెచ్‌ఎం ఎం.వెంకటసుబ్బారావు మాట్లాడుతూ వీరంతా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. ఈనెల 22 నుంచి 24 వరకు నెల్లూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, పీడీ నూకల సీతాపతి, గ్రామపెద్దలు అభినందించారు.

దేవరపల్లి: దేవరపల్లి మండలంలోని రామన్నపాలెం హైస్కూల్‌లో టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సబ్ జూనియర్ స్థాయి బాలబాలికల సెలక్షన్స్ జరిగాయి. ఇందులో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఈనెల 21,22 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా సోంపేట డిపూడిలో జరిగే క్రీడల్లో పాల్గొంటారని శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ తెలిపారు. టెన్నికాయిట్‌కు ఎం.ప్రియదర్శిని, షేక్ లతీఫా, ఆర్. శౌరిక, ఎం. లోహితాశ్రీ, పీ.అక్షయ, బాలురు జీ.బాబీ, వై.ఈశ్వర్, చిన్నబాబు, ఆకాశ్, ఎంపికయ్యారు. కార్యక్రమంలో టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు గద్దే చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి ఏవీఆర్ సరస్వతి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సినీ నటి హేమకు మాతృవియోగం



తల్లి భౌతికకాయం వద్ద విలపిస్తున్న హేమ

రాజోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటి హేమకు మాతృవియోగం కలిగింది. ఆమె తల్లి కోళ్ల లక్ష్మి (80) రాజోలులో సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. ఈమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తల్లి లక్ష్మి మరణ వార్త తెలియగానే హైదరాబాద్ నుంచి హుటాహుటిన హేమ బయలుదేరి రాజోలు చేరుకున్నారు. సోంపల్లిలో లక్ష్మి అంత్యక్రియలు జరిగాయి. లక్ష్మికి కుమార్తె హేమ, కుమారుడు లక్ష్మీ ఫ్యాషన్ స్టూడియో అధినేత శ్రీనివాస్ ఉన్నారు. హేమను పలువురు పరామర్శించి సంతాపం తెలిపారు.

శిఖామణికి సప్పా ఎక్స్‌లెన్స్ అవార్డ్-2025



శిఖామణి

యానాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ నాట్య గురువు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ జన్మదినం సందర్భంగా ప్రతి ఏటా ఇచ్చే సప్పా ఎక్స్‌లెన్స్ అవార్డ్- 2025కు సాహిత్య విభాగంలో యానాంకు చెందిన ప్రముఖ కవి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు, కవి సంధ్యా సంపాదకుడు, కళారత్న డాక్టర్ శిఖామణి ఎంపికయ్యారు. ఈనెల 23 వ తేదీ ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరంలోని తాడితోటలో గల సంహిత కన్వెన్షన్ హాలులో అవార్డుల ప్రదానోత్సవ సభ జరగనుంది. సాహిత్య, కళా, సామాజిక, తదితర రంగాలలో వంశీ నివాస్, పొత్తూరి సుబ్బారావు, హేమ సుందర్ వంటి 15 మంది ప్రముఖులున్నారు. సభలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మండలి బుద్ధప్రసాద్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జీవీ హర్షకుమార్, తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య డి.మునిరత్నం నాయుడు, తదితరులు పాల్గొననున్నారు. డాక్టర్ శిఖామణికి అవార్డు ప్రకటించడం పట్ల పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, దాట్ల దేవదానంరాజు, డాక్టర్ వరుగు భాస్కర్‌రెడ్డి, మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, పోనుగుమట్ల విష్ణుమూర్తి, ముమ్మిడి చిన్నారి, సీహెచ్ రాం, రవి, పోనుగుమట్ల అశోక్, తదితరులు అభినందనలు తెలిపారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

రిమాండ్‌కు తరలింపు

సీతానగరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) బాలికపై అత్యాచారానికి పాల్పడిన సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామానికి చెందిన గుడుసుల నాగ వెంకటేష్‌కు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ డి.రామ్ కుమార్ తెలిపారు. ఇంటర్మీడియట్ చదివి విశాఖపట్నంలో ఎయిర్ హోస్టెస్‌గా శిక్షణ పొందుతున్న బాలికను వాట్సాప్ ద్వారా వెంకటేష్ పరిచయం చేసుకున్నాడు. ఇంటర్వ్యూ ఉందని తల్లిదండ్రులకు చెప్పి రమ్మనడంతో ఆమె అలాగే ఇంటి వద్ద చెప్పి వచ్చింది. ఇద్దరు గత నెల 31 నుంచి హోటల్లో గడిపారు. దగ్గరకు రాకపోతే మన మిద్దరం తీసుకున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంటికి వెళ్లాక విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వెంకటేష్ ఇంటికి వెళ్లగా వెంకటేష్ తల్లి వారిని కులంపేరుతో దూషిస్తూ దుర్భాషలాడింది. దీంతో ఈ నెల 16న బాలిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంకటేష్‌తో పాటు అతడి తల్లిపై కేసు నమోదు చేశారు.నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ సోమవారం సాయంత్రం 6గంటలకు రఘుదేవపురం సెంటర్‌లో వెంకటేష్‌ను అరెస్టు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

బిడ్డలతో సహా దూకేశాడు!

- చించినాడ బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి తండ్రి అఘాయిత్యం
- ఇద్దరి మృతదేహాలు లభ్యం.. బాలిక ఆచూకీ కోసం గాలింపు
- లక్కవరంలో విషాదఛాయలు



తండ్రి దుర్గాప్రసాద్, కుమారుడు మొహిత్ మృతదేహాలు



మలికిపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో ఓ తండ్రి తన ఇద్దరు బిడ్డలతో కలిసి చించినాడ బ్రిడ్జిపైనుంచి గోదావరిలోకి దూకేశాడు. వీరిలో ఇద్దరి మృతదేహాలు లభ్యం కాగా బాలిక మృతదేహంకోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మలికిపురం మండలం లక్కవరానికి చెందిన శిరిగినీడి దుర్గాప్రసాద్(39) తన కుమారుడు మోహిత్(14), కుమార్తె జాహ్నవి(9)లతో సహా సోమవారం రాత్రి దిండి-చించినాడ వశిష్ట వారధిపైనుంచి గోదావరిలోకి దూకాడు. ముందుగా వంతెనపై తన మోటారుసైకిల్, సెల్‌ఫోన్, ఆధార్‌కార్డులను చెప్పులు వదిలేశారు. దుర్గాప్రసాద్ తన భార్య నాగవేణి, పిల్లలతో కలసి వారంరోజులుగా విశ్వేశ్వరాయపురంలోని అత్తవారింట్లో ఉంటున్నాడు. 8వ తరగతి చదువుతున్న మోహిత్, 4వ తరగతి చదువుతున్నజాహ్నవిలను ఆధార్ అప్‌డేట్ చేయించాలని చెప్పి సోమవారం సాయంత్రం ఇంట్లోనుంచి తీసుకువెళ్లి వారధిపైనుంచి దూకేశాడు. వీరి ఆచూకీ కోసం మంగళవారం ఉదయం వరకు పలుచోట్ల గాలించారు. మధ్యాహ్నం నుంచి రాజోలు, యలమంచిలి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నదిలో దుర్గాప్రసాద్, మోహిత్‌ల మృతదేహాలు లభ్యమయ్యాయి. కుమార్తె జాహ్నవి ఆచూకీ ఇంకా దొరకలేదు. చీకటి పడడంతో పోలీసులు గాలింపు చర్యలు నిలిపివేశారు. కుటుంబ మనస్పర్థల నేపథ్యంలో ఈ సంఘటన జరిగి ఉండవచ్చునని రాజోలు సీఐ టి.నరేష్‌కుమార్ తెలిపారు. అందరితో కలుపుగోలుగా ఉండి వివాదరహితంగా ఉండే దుర్గాప్రసాద్ ఈ నిర్ణయం తీసుకోవడంతో పలువురు విచారం వ్యక్తం చేశారు. తన భర్తతోపాటు కుమార్తె, కుమారుడు కనిపించడం లేదని నాగవేణి ఫిర్యాదు చేసినట్టు మలికిపురం ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. ఈ సంఘటన మలికిపురం మండలంలోని లక్కవరం, విశ్వేశ్వరాయపురం, బట్టేలంక, కత్తిమండ గ్రామాల్లో సంచలనం రేకెత్తించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

వైభవంగా కార్తీక దీపారాధన

- ప్రసన్నాంజనేయుడికి వేదమంత్రాలతో పూజలు
- అలరించిన సినీ సంగీత విభావరి



ఉష్ట్ర వాహనంపై ఊరేగుతున్న ప్రసన్నాంజనేయస్వామి



సినీగేయాలాపన చేస్తున్న గాయనీ, గాయకులు



ద్రాక్షారామ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో 62వ కార్తీక దీపారాధన కార్యక్రమం మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం 6 గంటలకు వేదపండితుడు జుత్తుక చిన్న ఆధ్వర్యంలో ప్రసన్నాంజనేయస్వామికి వేదమంత్రాలతో లక్షతులసి, తమలపాకుల పూజలు చేశారు. స్వామివారిని పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, తనయుడు సూర్యప్రకాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కార్తీక దీపారాధన మహోత్సవంలో యాంకర్ సోనా వ్యాఖ్యానంతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శన ఆకట్టుకుంది. శుభమ్ ఈవెంట్స్ నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయనీ గాయకులు శ్రీకీర్తి, సాయిశిల్ప, ఓంకార్, నజీరుద్దీన్‌షేక్, రసూల్ ఆలపించిన సినీగేయాలు అలరించాయి. 12గంటలకు ఉమాశ్రీ కళానికేతన్ కళాకారులు ప్రదర్శించిన రామాంజనేయ యుద్ధం ఘట్టం, మయసభ, సత్యహరిశ్చంద్ర(వారణాసి)లను రంగస్థల నాటక ప్రియులు ఆసక్తితో తిలకించారు.

శబరిమల స్వాములకు 20 ప్రత్యేక రైళ్లు

- విశాఖ నుంచి సామర్లకోట మీదుగా కొల్లాం



సామర్లకోట, నవంబరు 18(ఆంధ్ర జ్యోతి): కార్తీకమాసంలో అయ్యప్పస్వామి భక్తుల ప్రయాణ సౌకర్యార్థం విశాఖ నుంచి సామర్లకోట మీదుగా కొల్లాంకు 20ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్టు రైల్వే ఈస్ట్‌కోస్ట్ పీఆర్వో కార్యాలయం నుంచి సామర్లకోట రైల్వేస్టేషన్‌కు ఉత్తర్వులు అందాయి. ఈ నెల 18నుంచి జనవరి 21వరకు ఈ ప్రత్యేక రైళ్లు నడవనున్నట్లు ఆ లేఖలో తెలిపారు. ఈ రైళ్లలో ప్రయాణం ద్వారా తమిళనాడులోని పలు ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలను సందర్శించే వీలుంటుందని తెలిపారు.

- నెం.08539 విశాఖ-కొల్లాం మధ్య ప్రతీ మంగళవారం ఉదయం విశాఖలో ఉదయం 8.20కు బయలుదేరి సామర్లకోటకు ఉదయం 10.28కు చేరుకుంటుంది. బుధవారం మధ్యాహ్నం 1.45కు కొల్లాం చేరు తుంది. ఈ ప్రత్యేక రైలు నవంబరు 18, 25, డిసెంబరు 2, 9, 16, 23, 30 జనవరి 6, 13, 20 తేదీల్లో పది ట్రిప్‌లుగా నడువనుంది. ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సామర్లకోటకు 10.28 గంటలకు చేరుకుని, రాజమహేంద్ర వరానికి ఉదయం 11.13కు చేరుకుంటుంది. తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పెట్టయ్, సేలం, ఈరోడ్. తిరుప్పూర్, పొడనూర్, పాలక్కాడ్, త్రిచూరు, అలువ, ఎర్నాకుళం టౌన్, కొట్టాయం, తిరువళ్ల, చెంగన్నూర్, కాయంకుళం మీదుగా కొల్లాం మధ్యాహ్నం 1.45గంటలకు చేరుకుంటుంది.
- నెం.08540గల కొల్లాం-విశాఖ మధ్య ప్రతీ బుధవారం సాయంత్రం 5 గంటలకు కొల్లాంలో బయలుదేరి మరుసటిరోజు గురువారంరాత్రి 11గంటలకు విశాఖ చేరుతుంది. ఈ ప్రత్యేక రైలు రాజమహేంద్రవరంనకు సాయంత్రం 6.13కు చేరుకుని, సామర్లకోటకు రాత్రి 7.00 గంటలకు చేరుకుని దువ్వాడ మీదుగా విశాఖకు రాత్రి 11 గంటలకు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైలు నవంబరు 19, 26 డిసెంబరు 3, 10, 17, 24, 31 జనవరి 7, 14, 21 తేదీలలో పది ట్రిప్‌లుగా నడవనుంది. ఈ రైలులో రిజర్వేషన్ టిక్కెట్ల బుకింగ్‌కు సమీపంలోని రైల్వే బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే పీఆర్వో కార్యాలయ అధికారి ఆ ఉత్తర్వుల్లో తెలిపారు.

కరప బీసీ హాస్టల్‌లో అగ్నిప్రమాదం

పాత ఫర్నీచర్ దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

కరప, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. అధికారులు, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక పీహెచ్‌సీ వెనుక జీ+3 భవనంలో బీసీ గురుకుల పాఠశాల నిర్వహిస్తున్నారు. 213 మంది విద్యార్థులు ఐదు నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. భవనానికి కేటాయించిన లిఫ్ట్ జాగా ఖాళీగా ఉండడంతో సిబ్బంది అందులో పాత ఫర్నీచర్‌ను డంప్‌చేశారు. రెండో అంతస్తు వరకూ పేరుకుపోయిన ఈ ఫర్నీచర్ ఒక్కసారిగా తగులబడి భవనంపై వరకూ మంటలు వ్యాపించాయి. అప్పటివరకూ చదువుకుని మూడు అంతస్తుల్లోనూ నిద్రకు ఉపక్రమిస్తున్న విద్యార్థులు ఈ మంటలను చూసి ప్రాణభయంతో కేకలు వేశారు. నైట్ వాచ్‌మెన్, డ్యూటీ టీచర్లు స్పందించి అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. విద్యార్థులను మెట్ల మార్గం ద్వారా కిందకు తీసుకొచ్చారు. కరప ఎస్ఐ తోట సునీత, పోలీస్ సిబ్బంది, కాకినాడ జగన్నాయకపూర్ ఫైర్‌స్టేషన్ నుంచి అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా అసలు లిఫ్ట్ జాగాలోని పాత ఫర్నీచర్‌కు నిప్పు ఎలా అంటుకుందనే దానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా కాకినాడ జిల్లా బీసీ కళాశాల కన్వీనర్ లోవరాజు మంగళవారం సందర్శించి ఘటనపై విచారణ చేపట్టారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని యువకుడి మృతి

జగ్గంపేట రూరల్, నవంరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే పశ్చిమ గోదావరి జిల్లా తాళ్లపూడి గ్రామానికి చెందిన ఎం.సాయి (27) ఉపాధి నిమిత్తం జగ్గంపేట రూరల్ మామిడాడలో ఇటుక బట్టీ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడికి రెండేళ్ల క్రితం వివాహం కాగా మూడురోజుల క్రితం పాప పుట్టింది. మామిడాడలో పనులు ముగించుకుని స్వగ్రామం తాళ్లపూడి వెళ్తుండగా మామిడాడ శివారుకి వచ్చేసరికి ప్రైవేటు బస్సు ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్టేషన్ రైటర్ మాణిక్యం తెలిపారు.

యువతిని మోసం చేసిన యువకుడి అరెస్టు

రౌతులపూడి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం.. రౌతులపూడి చెందిన లోవ ప్రసాద్ ఏడేళ్లుగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి అవసరాలు తీర్చుకున్నాడు. పెళ్లి చేసుకోమని యువతి రెండేళ్లుగా ప్రసాద్‌ను అడుగుతుండగా చేసుకోనని ముఖంచాటేశాడు. దీంతో ఆమె ఈనెల 7న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం రాత్రి రౌతులపూడిలో శివాలయం వద్ద నిందితుడు ప్రసాద్‌ను అరెస్టు చేశారు.

పీఏసీఎస్‌ల బలోపేతానికి కృషిచేయాలి

డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి

కాకినాడ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రైతులకు అందుబాటులో ఉండే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్)లను బలోపేతంచేసేందుకు పర్సన్ ఇన్‌చార్జిలు కృషిచేయాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి సూచించారు.ఆప్కాబ్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో కాకినాడ డీసీసీబీలో పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలకు నిర్వహిస్తున్న వర్క్‌షాప్ మంగళవారం కొనసాగింది. సహకార చట్టం, రుణాల మంజూరు, రుణాల రికవరీ, సొసైటీల బైలాపై ఆప్కాబ్ ఫ్యాకల్టీ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సహకార శాఖ అధికారులు, డీసీసీబీ, సొసైటీల సిబ్బంది సమన్వయంతో పనిచేయడం ద్వారా డీసీసీబీ ప్రగతి పథంలోనికి వస్తుందన్నారు. రెండు రోజుల పాటు జరిగిన శిక్షణలో కాకినాడ జిల్లా నుంచి సుమారు 72 పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలు, డీసీసీబీ సీఈవో ప్రవీణ్‌కుమార్, డీపీడీఎం బాపూజీ, డీజీఎం శ్రీధర్ చౌదరి, ఆప్కాబ్ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

కడియపులంకలో మహా అన్నదానం



డీఎస్పీ భవ్యకిషోర్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ

కడియం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కడియపులంక హరిహర మహాక్షేత్రం వద్ద కార్తీక మాసం సందర్భంగా మహా అన్నదానం నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. హరిహర క్షేత్రం ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ, అభయాంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్ వల్ల సుబ్రహ్మణ్యం, ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ భవ్యకిషోర్, సీఐ ఎ.వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం డీఎస్పీని ఆలయ కమిటీ సత్కరించింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.

వైద్యుల సూచనతోనే యాంటీ బయోటిక్స్ వాడాలి

సీతానగరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అర్హత గల వైద్యుల సూచనల మేరకు మాత్రమే యాంటీ బయోటిక్స్ వాడాలని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఏవీకె చైతన్య, డాక్టర్ యేసురాణి అన్నారు. మంగళవారం స్థానిక ఆయుష్మాన్ మందిర్‌లో ప్రపంచ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై అవగాహన వారోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అవసరానికి మించి యాంటీబయాటిక్ మందులు వాడితే ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ఇంట్లో ఒకరికి రాసిన మందులు మిగిలిపోయాయని మరొకరు వాడకూడదన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వై.సుబ్బారాయుడు, సూపర్‌వైజర్ సుధాకర్, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు విద్యుత్ స్తంభాలు వేయాలి

దివాన్‌చెరువు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొత్తతుంగపాడులోని ఎస్సీ, బీసీల శ్మశాన వాటికకు విద్యుత్ స్తంభాలు వేయాలని కోరుతూ డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు యాళ్ల మాసరయ్య ఆధ్వర్యంలో అధికారులకు విజ్ఞప్తిచేశారు. ఈ విషయమై సంపత్‌నగరం విద్యుత్ ఉపకేంద్రం ఎదుట మంగళవారం ఫ్లెక్సీతో కొద్దిసేపు ప్రదర్శన చేశారు. దీనిపై మాసరయ్య మాట్లాడుతూ ఈ సమస్యను తాము ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దృష్టికి తీసుకెళ్లామని, సమస్య పరిష్కారానికి ఆయన ఇచ్చిన హామీ ఇంతవరకూ నెరవేరలేదన్నారు. అధికారులు స్పందించి సమస్యను సత్వరం పరిష్కరించాలని మాసరయ్య కోరారు.

ఫార్మసీ విద్యార్థులకు సృజనాత్మక పోటీలు

రాజానగరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఫార్మసీ వారోత్సవాల సందర్భంగా ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ రాజమండ్రి బ్రాంచ్, స్కూల్ ఆఫ్ ఫార్మసీ, గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఫార్మసీ విద్యార్థులకు ఫార్మాసిస్టులు -టీకాకు మద్దతుదారులు అన్న అంశంపై మంగళవారం చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం పోటీల్లో 14 మంది, వ్యాసరచన పోటీల్లో 28 మంది, డిబేట్‌కు మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు కె.మనోహర్ బాబు, సి.గోపి, సీహెచ్ సత్యశ్రీ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి, విజేతలను ప్రకటించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, లైబ్రేరియన్ షేక్ మీరా, ఎస్.కోటేశ్వరరావు, ఆర్.మంగేష్ తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో వృద్ధురాలి మృతిపై విచారణ

గోకవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గోకవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో జరిగిన వృద్ధురాలి మృతిపై వైద్యశాఖకు చెందిన ఇద్దరు అధికారులు మంగళవారం విచారణ నిర్వహించారు. మృతురాలి కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలో కొత్తపల్లికి చెందిన కొప్పుల నూకరత్నం(62) అనారోగ్యానికి గురవ్వడంతో గత ఏప్రిల్ 17న గోకవరం తహశీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. ఆమెను పరీక్షించిన వైద్యులు గ్యాస్ నొప్పిగా భావించి సెలైన్ పెట్టి పంపిస్తామని చెప్పి ఆసుపత్రిలోనే ఉంచారు. అటుపై ఆమెకు అక్కడి నర్సులు వైద్యం చేశారు. అయితే 18వ తేదీ మధ్యాహ్నం నూకరత్నం ఆసుపత్రిలోనే ప్రాణాలు విడిచింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆమె మృతిచెందినట్టు మృతురాలి కుమార్తె చల్లా రాజ్యలక్ష్మి కలెక్టరేట్ జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు ఆదేశాలతో ఇద్దరు ప్రభుత్వ వైద్యులు సంబంధిత ఆసుపత్రిలో విచారణ చేసి వెళ్లినట్టు తెలియవచ్చింది.

పోలవరం ముంపు బాధితుల నిరసన దీక్ష

గోకవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం దేవీపట్నం గ్రామాన్ని ఖాళీచేసి సుమారు ఆరు సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకూ తమకు కాలనీ నిర్మాణం పూర్తి చేయలేదంటూ గోకవరంలోని గంగాలమ్మ గుడి వద్ద ముంపు నిర్వాసితులు మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ గోకవరం శివారున తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, కోర్టులో ఉన్న 9 ఎకరాల భూమి సమస్యను పరిష్కరించాలని, మౌలిక వసతులు కల్పించాలని, కాలనీ చుట్టూ ప్రహరీ నిర్మించాలని, అర్హులందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని డిమాండు చేశారు. గేదెల పెద్ద సుబ్బారావు, గేదెల చిన్నసుబ్బారావు, దొడ్డ సింహాద్రి, సిద్ధా నాని, పాల్గొన్నారు.

'ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం'

కోరుకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా అన్ని విధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కోరుకొండలో జరిగిన వన సమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు ఓలేటి సూర్యనారాయణ మూర్తి, కప్పల స్వామి, కటకం చలం, కర్రి వీరగణేష్, అడ్డాల శ్రీను, బదిరెడ్డి దొర, తాటికొండ శ్రీను, తాటికొండ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

దివాన్‌చెరువు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. జిల్లా వృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నన్నయ వర్సిటీలో నషాముక్త్ భారత్ అభియాన్ వార్షిక ఉత్సవాలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీని వీసీ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలకు బానిస కావద్దని అన్నారు. డ్రగ్స్ అలవాటుగా మారితే వారి జీవితాలు నాశనం అవుతాయని చెప్పారు. అడిషనల్ ఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత సమాజనిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, డీన్ ఎన్.ఉదయభాస్కర్, పీసీసీ డ్రగ్ డి-అడిక్షన్ సెంటర్ డాక్టర్ సుందరరాజు పాల్గొన్నారు.

దత్తాత్రేయ గురుకులానికి భారతాత్మ విశిష్ఠ పురస్కారం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొంతమూరులోని శ్రీ దత్తాత్రేయ వేద విద్యా గురుకులాన్ని, ఉత్తమ గురుకులంగా సింఘాల్ ఫౌండేషన్ గుర్తించి, ప్రతిష్ఠాత్మక భారతాత్మ విశిష్ఠ పురస్కారాన్ని అందజేసింది. గురుకులం వ్యవస్థాపకుడు, ప్రధాన ఆచార్యులు గుళ్లపల్లి సీతారామచంద్ర తరపున గుళ్లపల్లి లక్ష్మీనారాయణ దత్తాత్రేయ, పైడిమర్రి చంద్రశేఖర్ ఈ పురస్కారాన్ని పూణేలో గోవింద వేద గిరీజీ, ఆచార్య స్వామి ప్రద్యుమ్న చేతుల మీదుగా అందు కున్నారు. పురస్కారం కింద రూ.7 లక్షల చెక్కు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు.పురస్కారం రావడం పట్ల సీతారామ చంద్ర ఘనాపాఠి హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

రంగంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విప్లవ అమరవీరుల పోరాటస్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాడాలని ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల ఆంజనేయులు పిలుపునిచ్చారు.మంగళవారం సింగంపల్లిలోని సీపీరెడ్డి నగర్‌లో ఏపీ రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, పీడీఎస్‌యూ(వి)ప్రగతిశీల మహిళా సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విప్లవవీరుల సంస్మరణ సభ ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంజనేయులు మాట్లాడారు. అసమానతలు లేని సమాజం కావాలని ఎందరో మహనీయులు ప్రాణాలనర్పించారన్నారు.నేడు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ, కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పి ప్రజలపై భారం మోపుతున్నాయని ఆరోపించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అనపర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అనపర్తిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం దుప్పలపూడిలో ఏర్పాటు చేసుకున్న కార్తీక వన సమారాధనలో పాల్గొని సందడి చేశారు. 23 సంవత్సరాల తరువాత కలుసుకున్న మిత్రులు ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెలుసుకుంటూ చిన్ననాటి ముచ్చట్లు నెమరవేసుకుంటూ సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. వీరంతా త్వరలోనే మరోసారి కలుసుకుని తాము చదువుకున్న పాఠశాల భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్టు పేర్కొన్నారు.

నేడు పందలపాకలో 'సుఖీభవ'

అనపర్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాత సుఖీభ వ.. పీఎం కిసాన్ పథకాల ద్వారా రైతులకు సహాయం అందించే కార్యక్రమం బుధవారం నియోజకవర్గ పరిధిలో బిక్కవోలు మండలం పందలపాకలో నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ పథకం ద్వారా అనపర్తి మండలంలో 3342 మంది రైతులకు రూ.2.32 కోట్లు, బిక్కవోలు మండలంలో 5932 మంది రైతులకు రూ.4.0 కోట్లు, రంగంపేట మండలంలో 8321 మంది రైతులకు రూ.5.50 కోట్ల నిధులు జమకానున్నాయని సంబంధిత అధికారులు తెలియజేశారు.

జాబ్ మేళా వాయిదా

అనపర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వికాస ఆధ్వర్యంలో ఈనెల 22న అనపర్తి జడ్పీ హైస్కూల్లో జరగాల్సిన జాబ్ మేళా 23వ తేదీకి మార్పు చేసినట్టు వికాస ప్రతినిధులు మంగళవారం విలేకరులకు తెలిపారు.ఉదయం 9గంటలకు మేళాను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభిస్తారని, మేళాలో సుమారు 30 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



గ్రంథాలయ పరిషత్ మెంబర్ పద్మజను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక సీతంపేట గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, గాంధీ మహాత్ముడి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. పోటీల్లో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, గ్రంథాలయాన్ని సందర్శించిన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మెంబరు మగతాల పద్మజను సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు, గౌతమి గ్రంథాలయాధికారి ఘంటా శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు. పద్మజ గౌతమీ గ్రంథాలయాన్ని సందర్శించి గ్రంథాలయంలోని విలువైన తాళపత్రాలను, తామ్ర శాసనాలను, ప్రాచీన గ్రంథ సంపదను తిలకించారు. గ్రంథాలయంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా రమాకుమారి, ద్రాక్షావళి, సూర్యకుమారి వ్యవహరించారు.

రంగంపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎస్.రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రంథాలయోద్యమకారుల సంస్మరణ సభ జరిగింది. దీనికి స్థానిక జడ్పీ హైస్కూల్ హెచ్ఎం వి.పార్థసారథి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గ్రంథాలయోద్యమానికి అయ్యంకి వెంకటరమణయ్య సేవలు చిరస్మరణీయమని అన్నారు. ముందుగా అయ్యంకి, ఎస్ఆర్ రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుభాషపై పట్టు సాధించడానికి పద్యాలు, సాహిత్య పుస్తకాలు చదవాలని బీజేపీ సీనియర్ నాయకుడు ఉండవిల్లి మాణిక్యం విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించినట్టు గ్రంథాలయాధికారి ఎస్.బాల తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులకు మన రాజధాని అమరావతి, జూనియర్ విద్యార్థులకు దేశనాయకులు అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాస్, డ్రాయింగ్ టీచర్ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రంగంపేటలో ఉద్యమకారుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

విశ్వేశ్వరుడికి ఏకాదశి రుద్రాభిషేకం



బూరుగుపూడిలో వీరేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామికి మంగళవారం ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. అంతకుముందు ఆలయార్చకులు విఘ్నేశ్వర పూజ, మహన్యాస కార్యక్రమం జరిగింది. అనంతరం స్వామివారికి పంచామృతాలతో ఏకాదశి రుద్రాభిషేకం జరిపారు. అనంతరం స్వామి వారికి లక్ష బిల్వార్చన, అమ్మవారికి లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి సహస్ర జ్యోతిర్లింగార్చన, రుద్ర హోమం జరిగింది. కార్యక్రమంలో కాపవరం సర్పంచ్ జాజుల రాము దంపతులు, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మిసరోజ దంపతులు, గోనగూడెం సర్పంచ్ రొంగల దేవిక దంపతులు, జంబుపట్నం సర్పంచ్ ఉల్లి అప్పన్నదొర దంపతులు, పరిసర గ్రామాల భక్తులు, బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

బూరుగుపూడిలో లక్ష బిల్వార్చన

మండలంలోని బూరుగుపూడిలో భద్రకాళి సమేత వీరేశ్వరస్వామికి మంగళవారం ఏకాదశి రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. కార్య క్రమంలో ఆలయ అనువంశక ధర్మకర్త క్రొవ్విడి సర్రాజు, సొసైటీ అధ్యక్షుడు కంటే నాగ కేశవరావు, జనసేన నాయకుడు అడపా శ్రీనివాస్ త దితరులు పాల్గొన్నారు. అలాగే జంబుపట్నంలో నూతనంగా నిర్మించిన శివాలయం వద్ద ఉమా విఘ్నేశ్వర స్వామికి ఏకాదశి రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన కార్యక్రమాలు ఆలయ ప్రధానార్చకు డు రమణమూర్తి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగాయి. కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లి సూర్యకుమారి, సర్పంచ్ ఉల్లి అప్పన్నదొర, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుమార సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు

బిక్కవోలు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరి మంగళవారం కావడంతో బిక్కవోలులోని ప్రాచీన శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు రాహు, కేతు, సర్ప, కాల దోష నివారణార్థం పూజలు చేశారు. భక్తులకు ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ అన్నప్రసాదాన్ని అందించారు. అలాగే మాసశివరాత్రి సందర్భంగా గోలింగేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాలు జరిపి, లక్ష బిల్వార్చన జరిపారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటం

రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ నిరసన ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ప్రజావ్యతిరేక విధానాలపై దళిత, బహుజన, గిరిజనులు ఐక్య పోరాటాలు సాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, జనగణనలో కులగణన చేపట్టాలని కోరుతూ నిరసన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి మధు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన 11 ఏళ్ల కాలంలో దళితులు, గిరిజనులు, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. దేశంలో మతోన్మాద పాలన సాగుతున్నదని, అణచివేత అంటరానితనం, కుల మత వివక్షత, హింస పేట్రేగిపోతున్నదని అన్నారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోనే రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన సాగిస్తున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య హక్కులను హరించే శక్తులను తిప్పికొట్టేందుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి గోకవరం బస్టాండు అంబేద్కర్ విగ్రహం సెంటర్ వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, జట్టు సంఘం అధ్యక్షుడు కూండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు, సహాయ కార్యదర్శి లావణ్య, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, జట్టు సంఘం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే గ్రామాల అభివృద్ధి

బిక్కవోలు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రంగా వున్నప్పుడే గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని ఎంపీపీ తేతలి సుమ సూచించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులకు క్లీన్ అండ్ గ్రీన్ అనే అంశంపై మంగళవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ సురేష్ పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలపై తీసుకోవల్సిన చర్యలు, చెత్త నుంచి సంపద తయారీని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాస్, డిప్యూటి ఎంపీడీవో జాన్ మిల్టన్, ఏవో నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నవ వధువు అదృశ్యం

బిక్కవోలు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కాపవరం గ్రామానికి చెందిన నూతన వధువు అదృశ్యమయ్యిందంటూ ఆమె భర్త తోటకూర సత్తిబాబు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పెద బ్రహ్మదేవం గ్రామానికి చెందిన తోటకూర సత్తిబాబుకు బిక్కవోలు మండలం కాపవరం గ్రామానికి చెందిన యువతితో ఈనెల 7న వివాహమైంది. ఈనెల 9 నుంచి సత్తిబాబు భార్య కాపవరంలోనే ఉంటోంది, ఈనెల 16న సత్తిబాబు అత్తమామలు కాకినాడ హస్పిటల్‌కు వెళ్లారని, ఆ రోజు రాత్రి సత్తిబాబు, భార్య, మరదలు ఇంటిలోనే ఉన్నారు. 17న ఉదయం 4గంటలకు సత్తిబాబు భార్య గుడికి వెళ్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు ఇంటి వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో సత్తిబాబు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి: వాసు



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సూచించారు. స్థానిక ఆనంద్ నగర్‌లోని ఇందిరానగర్ జమున మున్సిపల్ స్కూల్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. నేరుగా పాఠశాలలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. బోధన, పాఠశాలలో సమ స్యలపై ఆరా తీశారు.పదో తరగతి విద్యార్థుల అభ్యాసం, మౌలిక సదుపాయాలను పరిశీలన చేశారు. స్కూల్ పరిసరాల్లో ఆకతాయిల బెడద ఉన్నా, ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఆర్‌వో ప్లాంట్‌ను, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు కొయ్యల రమణ, మొకమాటి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌జీఎస్‌ఏపై అవగాహనకు శిక్షణ

రంగంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ స్థానిక బలోపేతానికి కేంద్రప్రభుత్వం చేపట్టిన రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్(ఆర్‌జీఎస్‌ఏ) పథకంపై అవగాహన పెంపుదల, పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమాల అమలుకు సంబంధించిన సమగ్ర మార్గదర్శకాలను అందించే లక్ష్యంతో మంగళవారం రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వీవీ సాయిబాబు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పచ్చదనం కార్యక్రమాల ప్రణాళిక, మొక్కలను నాటడం, వ్యర్థాల నిర్వహణ, గ్రామ పరిశుభ్రత, ప్లాస్టిక్ నియంత్రణ, నీటి వనరుల సంరక్షణ వంటి అంశాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణా కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి ఎస్‌జీ శివమణికంఠ నిర్వాహకుడిగా వ్యవహరించారు. గ్రామ స్థాయి కార్యకలాపాలను సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన వ్యూహాలు, ఆధునిక పద్ధతులు, ప్రభుత్వ మార్గదర్శకాలు, డిజిటల్ పంచాయతీ యాప్‌ల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీరామమూర్తి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ క్రికెట్ పోటీలకు వర్షిణి ఎంపిక



దివాన్‌చెరువు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్-19 క్రికెట్ పోటీలకు తమ కుమార్తె గంగిశెట్టి వర్షిణి ఎంపికైనట్టు రాజానగరం మండలం పాలచర్లకు చెందిన గంగిశెట్టి రాజేంద్ర మంగళవారం తెలిపారు. దివాన్‌చెరువులోని ఓక్‌ఉడ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వర్షిణి ఈ నెల మొదటివారంలో శ్రీకాకుళంలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీల్లో పాల్గొని బౌలింగ్, ఆల్‌రౌండర్‌గా నిల్చి జాతీయ పోటీలకు ఎంపికైందని చెప్పారు. వచ్చే జనవరి మొదటివారంలో మధ్యప్రదేశ్‌లోని శివపూర్‌లో జరిగే పోటీల్లో వర్షిణి పాల్గొంటుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పలువురు అభినందించారు.

బాలిక అదృశ్యంపై కేసు


సీతానగరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగలపూడి గ్రామానికి చెందిన పదహారేళ్ల బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ డి.రామ్‌కుమార్ వివరాల ప్రకారం.. బాలిక సరిగా చదవడం లేదని ఇంటి వద్ద ఈ నెల 16న మందలించారు. అదే గ్రామంలో ఉంటున్న మేనత్త ఇంటి వద్ద పడుకుంటానని చెప్పి అదే రోజు రాత్రి 8.30 గంటలకు వెళ్లింది. సోమవారం ఉదయం ఇంటికి వెళతానని చెప్పిన బాలిక కనిపించకుండాపోయింది. దీంతో సోమవారం రాత్రి బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా బాలిక నాగంపల్లిలోని బంధువుల ఇంటి వద్ద ఉందని గుర్తించి మంగళవారం తల్లి దండ్రులకు అప్పగించారు.

పేకాడుతున్న 9 మంది అరెస్టు

గోకవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై దాడిచేసి 9 మంది వ్యక్తులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని తంటికొండ గ్రామ శివారున తోటలో జరుగుతున్న కార్తీక వనసమారాధనలో పేకాట నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్ ఆధ్వర్యంలో శిబిరంపై దాడి చేసి 9 మంది అరెస్టు చేసి వారి నుంచి రూ.73,520 నగదును స్వాధీనం చేసుకున్నారు.

వివాహితపై కట్నం వేధింపులు

కొవ్వూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అతడి బంధువులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరులోని భవానిపురానికి చెందిన మాగాపు పుల్లారత్నం కుమార్తె అరుణకు, కొవ్వూరుకు చెందిన ఎలుబండి వెంకటసత్యనారాయణతో వివాహం చేశారు.అరుణను అదనపు కట్నం అత్త, మరిది, భర్త వేధింపులకు గురిచేయడంతో ఈ నెల 4న ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబీకులు గమనించి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. అరుణ తల్లి పుల్లారత్నం అందించిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.





రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద భద్రతా బలగాలు

నేడు అన్నదాత సుఖీభవ

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అర్హులైన 1,14,991 మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ 21 విడత కింద ఆర్థిక సహాయాన్ని నేరుగా రైతుల ఖాతాకు జమ చేస్తారని కలెక్టర్ కీర్తి చేకూరి మంగళవారం తెలిపారు. దేశవ్యాప్తంగా బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ కోయంబత్తూర్ నుంచి, కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం చినదాసరపల్లి నుంచి సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారన్నారు.

హెచ్ఎం అకౌంట్ టెస్ట్‌కి దరఖాస్తులు స్వీకరణ

రాజమహేంద్రవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పని చేస్తున్న అర్హత కలిగిన ఉపాధ్యాయులకు నిర్వహించే హెచ్ఎం అకౌంట్ టెస్ట్‌కి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని డీఎస్ఈవో వాసుదేవరావు తెలిపారు. రెండు పేపర్లకు రూ.150, ఒక పేపర్‌కి రూ.100 రుసుంను సీఎఫ్ఎంఎస్ ద్వారా మాత్రమే చెల్లించాలని చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఈ నెల 17 నుంచి అందుబాటులోకి వచ్చిందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

విశాఖలో పెట్టుబడుల సదస్సు గ్రాండ్ సక్సెస్
ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నంలో జరిగిన ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు గ్రాండ్ సక్సెస్ అయ్యిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరానికి కూడా ఏవియేషన్ రంగంలో రూ.100 కోట్ల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై రాష్ట్రంలో ప్రత్యేక దృష్టి పెడుతున్నారన్నారు. బిహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ ముఖ్య నాయకుడు రాహుల్‌గాంధీ ఓటు చోరీ అంటూ చేసిన తప్పుడు ప్రచారాన్ని బిహార్ ప్రజలు పట్టించుకోలేదన్నారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ అత్యంత పకడ్బందీగా ఉన్నపుడు ఓటు చోరీకి ఎక్కడ అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, లక్ష్మీ ప్రసన్నశ్రీదేవి పాల్గొన్నారు.




సత్యసాయి ప్రతినిధులతో మంత్రి దుర్గేష్

రాష్ట్ర పండుగగా సత్యసాయి జయంతి
మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రాష్ట్ర అధికారిక పండుగగా నిర్వహిస్తున్న భగవాన్ శ్రీ సత్యసాయి శతజయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలులోని సత్యసాయిబాబా మందిరంలో మంగళవారం శత జయంతి వేడుకలు ఘనంగా ప్రారంభించారు. బాబా తన ఆధ్యాత్మిక ప్రసంగాలతో అసంఖ్యాక ప్రజానీకానికి స్ఫూర్తి కలిగించి కోట్లాది భక్తుల ఆరాధ్య దైవంగా కీర్తించబడ్డారన్నారు.ఆయన సేవామార్గం అనుసరణీయమన్నారు. రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, విశాలాక్షి దంపతులు బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో కూటమి నాయకులు,సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేను లేని లోకాన.. మీరూ వద్దు! బిడ్డలతో సహా గోదారిలో దూకేసిన తండ్రి 7





రంపచోడవరంలో దట్టమైన అటవీ ప్రాంతం

అడవిలో కలిసిన.. ఆరో ప్రాణం!

ఆరుగురు మావోల ఎన్‌కౌంటర్
ఉమ్మడి జిల్లాలో ఉలికిపాటు

అడవిలో మావోయిస్టుల ఆరో ప్రాణం కలిసిపోయింది. ఉమ్మడి జిల్లా వణికింది.. మారేడుమిల్లి పేరు మళ్లీ మార్మోగింది.. ఎన్నో ఏళ్ల తర్వాత మళ్లీ తూటాలు పేలాయి.. ఆరుగురు మావోయిస్టుల ప్రాణాలు గాలిలో కలిశాయి.. పచ్చని చెట్లపై రక్తపు మరకలు పడ్డాయి. చాలా ఏళ్ల కిందట మారేడుమిల్లి అడవులకు వెళ్లాలంటే భయపడేవారు. అటువంటిది మావోయిస్టుల ప్రాభవం తగ్గింది.. దీంతో ఇప్పుడిప్పుడే అడవి అందాలు ఆస్వాదించేందుకు ఏజెన్సీ బాట పడుతున్నారు.. ఆరుగురు మావోల ఎన్‌కౌంటర్‌తో మళ్లీ భయం పెరిగింది.

- (కాకినాడ/మారేడుమిల్లి/రంపచోడవరం-ఆంధ్రజ్యోతి)

మారేడుమిల్లి ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతోంది. పర్యాటకులు ప్రకృతి అందాలు తిలకించేందుకు పోటెత్తుతుంటారు. అయితే ఉన్నట్టుండి ఒక్కసారిగా మంగళవారం ఉదయం ఆరున్నర గంటల సమయంలో తుపాకీ మోతలు.. బుల్లెట్ల శబ్దాలతో ఏం జరుగుతుందో తెలియని భయం నెలకొంది. కానీ ఆ తర్వాత కాసేపటికే ఎన్‌కౌంటర్ జరిగిందని తెలిసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉలిక్కిపడింది.

- మారేడుమిల్లిలో ఘటన
- గత కొన్నేళ్లుగా కానరాని జాడ
- తాజా ఎన్‌కౌంటర్‌తో అలజడి
- పోలీసుల ముమ్మర కూంబింగ్
- రంపచోడవరానికి మృతదేహాలు
- సామర్లకోటలో చిక్కిన మావోలు
- వీరిద్దరు హిడ్మా లేడీ గన్‌మెన్లు?

20 ఏళ్ల కిందట ఒకటి..

ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో మారేడుమిల్లి, వై.రామవరం అడవుల్లో మావోయిస్టుల ప్రాబల్యం ఉండేది. 1987 డిసెంబరు 27న ఏడుగురు ఐఏఎస్ అధికారులను మావోయిస్టులు వై.రామవరంలోని గుర్తేడు అడవుల్లో కిడ్నాప్ చేసిన ఘటన సంచలనంగా మారింది. ఆ తర్వాత మారేడుమిల్లి, వై.రామవరం అడవుల్లో వరుసగా మావోయిస్టులు పలువురిని చంపడం, వరుస కూంబింగ్‌లలో మావోయిస్టులు మరణించడం జరిగేవి. అయితే గడచిన కొన్ని దశాబ్దాలుగా మారేడుమిల్లిలో మావోయిస్టుల జాడే లేదు. మళ్లీ కొన్ని దశాబ్దాల తర్వాత మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరగడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ జరిగిన చోటుకు అతి సమీపంలో 20 ఏళ్ల కిందట ఓ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది.

అడవిని వదిలేసిన మావోలు..

ఛత్తీస్‌గఢ్ నుంచి ఆంధ్రా ప్రాంతంలోని పలు నగరాల్లోకి మావోయిస్టులు పెద్దఎత్తున చొరబడ్డారనే విషయం సంచలనంగా మారింది. ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో మావోయిస్టులకు తగులుతున్న వరుస ఎదురుదెబ్బలతో అక్కడ మనుగడ సాగించలేని పరిస్థితుల్లోనే మావోలు మన ఏజెన్సీని సురక్షిత ప్రాంతంగా ఎన్నుకోవడంతోపాటు ఇక్కడి నెట్‌వర్క్ ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారన్న సమాచారం హడలెత్తిస్తోంది. దీంతో ఆంధ్రాలోకి చొరబడే మార్గాల వెంబడి నిఘాను పెంచి వారి కదలికలను భద్రతా దళాలు గుర్తించినట్టు చెబుతున్నారు. ప్రస్తుతం అడవుల్లో ప్రత్యేక బలగాలతో కూంబింగ్‌లతోనూ, నగరాల్లో ఆక్టోపస్ బలగాలతోనూ పోలీసులు గాలిస్తున్నారు. మావోల కదలికలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

రాజమండ్రికి 100కి.మీ

ఉమ్మడి జిల్లాలో మావోయిస్టుల ఉనికి లేదనుకున్న తరుణంలో ఒక్కసారిగా భారీ సంఘటన కలకలం రేపింది. పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందడం.. అందులో ఒకరు మూడు రాష్ట్రాలు, కేంద్రం హిట్‌లిస్ట్‌లో ఉన్న మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మా కావడం పెను సంచలనంగా మారింది. అసలు మావోల జాడే లేదనుకున్న మారేడుమిల్లిలో ఏకంగా మావోయిస్టు అగ్రనేత తలదాచుకోవడం.. ఎన్‌కౌంటర్‌లో ఆయనతో పాటు మరో ఆరుగురు మరణించడం కలకలం రేపింది. రాజమహేంద్రవరం నుంచి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం వంద కిలోమీటర్లే కావడంతో విషయం తెలిసి ఉమ్మడి జిల్లా ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మారేడుమిల్లి మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల లోపే ఉండడం గమనార్హం. అదే సమయంలో ప్రశాంత నగరంగా పేరొందిన కాకినాడలో ఇద్దరు మహిళా మావోయిస్టులు పట్టుబడడం, వీరు హిడ్మా గన్‌మెన్‌లు కావడంతో ఉమ్మడి జిల్లా ఒకేరోజు రెండు ఉలిక్కిపడే ఘటనలతో వణికింది.

హిడ్మా ఇక్కడకెందుకొచ్చాడు చెప్మా?



మోస్ట్‌వాంటెడ్.. 26 కేసుల్లో నిందితుడిగా ఉన్న మావోయిస్టు హిడ్మా మారేడుమిల్లి అడవులకు రావడమేంటనే ప్రశ్న మొదలైంది. ఎక్కడో ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం అడవుల నుంచి తూర్పు కనుమల్లోని మారేడుమిల్లి అడవులకు రావడం చర్చనీయాంశంగా మారింది. మావోయిస్టు అగ్రనేత మారేడుమిల్లి అడవుల్లో సంచరించడం సంచలనం సృష్టించింది. మరోపక్క కాకినాడకు సమీపంలోని సామర్లకోట మండలం కొప్పవరంలో మంగళవారం మధ్యాహ్నం ఇద్దరు మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేయడం కలకలం రేపింది. వీరిద్దరు చనిపోయిన మావోయిస్టు అగ్రనేత హిడ్మా గన్‌మెన్‌లుగా పోలీసులు గుర్తించినట్టు సమాచారం. వీరు కొప్పవరం వద్ద రహదారి దాటుతుండగా పోలీసులకు చిక్కారు.

అల్లూరి జిల్లా షెల్టర్ జోన్ కానివ్వం




అల్లూరి సీతారామరాజు జిల్లాను మావోయిస్టులకు షెల్టర్‌జోన్ కానివ్వం. ఏపీ సరిహద్దు రాష్ట్రాల్లో ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితుల్లో మావోయిస్టులు అల్లూరి జిల్లాను షెల్టర్ జోన్ చేసుకుని మనుగడ సాధిద్దామనుకుని ఇక్కడకు చొరబడితే తగిన గుణపాఠం చెబుతాం. మావోయిస్టులు ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయారు. వారిని భయపెట్టి ఉద్యమాన్ని సాగించాలనుకున్నా ఎవరూ భయపడడం లేదు. ప్రజల్లో వారికి పెరిగిన వ్యతిరేకతే వారి అంతానికి కారణం. ఇకనైనా ఉద్యమాన్ని వీడి జన జీవన స్రవంతిలో కలవాలనుకునే మావోయిస్టులకు తాము స్వాగతం పలుకుతాం. - **అమిత్ బర్దర్, ఎస్పీ**

7 నెలలు.. 3 ఎన్‌కౌంటర్లు

(చింతూరు - ఆంధ్రజ్యోతి)

రంపచోడవరం ఏజెన్సీలో ఈ ఏడాది గడచిన ఏడు నెలల్లో మూడు ఎన్‌కౌంటర్లు జరిగాయి. 11 మంది మావోయిస్టులు మృతిచెందారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి, వై.రామవరం మండలాల అడవుల్లో ఇటీవల వరుస ఎన్‌కౌంటర్లతో ఆందోళన నెలకొంది. రంపచోడవరం అడవుల్లో గత దశాబ్దకాలంగా చెప్పుకోదగ్గ ఘటనలేమీ లేవు. ఈ ఏడాది వై.రామవరం మండలం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు.వారిలో ఆంధ్ర ఒడిస్సా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు టకూరి పండన్న అలియాస్ జగన్, ఏవోబీ డివిజన్ కమిటీ సభ్యుడు రమేష్ ఉన్నారు. జూన్‌లో మారేడుమిల్లి మండలం కింటు కుర్రు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావో యిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి, అలియాస్ ఉదయ్, కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి భార్య రావి వెంకట చైతన్య, కొవ్వాసి అంజు అలియాస్ మాసే ఉన్నారు. ఇక మంగళవారం మారేడుమిల్లి మండలం జీఎం వలస పంచాయతీలోని నెల్లూరు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, సౌత్ బస్తర్ బెటాలియన్ నాయకుడు హిడ్మా అలియాస్ సంతోష్, అతడి భార్య రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాజే అలియాస్ రాజక్క, దేవె, లఖాల్ అలియాస్ చైతు, మల్ల అలియాస్ మల్లాలు, కమ్ము కమలేష్ ఉన్నారు. ఇంతవరకూ జరిగిన ఎన్‌కౌంటర్లలో మృతిచెందిన వారంతా ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దు క్యాడర్ వారే. తాజా ఎన్‌కౌంటర్లో మృతి చెందింది మాత్రం ఛత్తీస్‌గఢ్ క్యాడర్ కావడం విశేషం.



అనంతపల్లిలో దీపోత్సవం

శివ..శివ..శంకర..

నల్లజర్ల/ కడియం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కరుణించు కార్తీక దామోదరా.. శివయ్యా కాపాడయ్యా అంటూ భక్తులు కార్తీక మాసం సందర్భంగా శైవక్షేత్రాలకు క్యూ కడుతున్నారు. ఎక్కడికక్కడ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మాసశివరాత్రిని పురస్కరించుకుని నల్లజర్ల మండలం అనంతపల్లి వేగిలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి కార్తీక దీపోత్సవం నిర్వహించారు. వేదపండితుడు గూడూరి రమేష్ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం చేశారు. కడియం మండలం కడియపులంక హరిహర క్షేత్రంలో అనంతేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.



కడియపులంకలో అనంతేశ్వరుడు



నన్నయ వర్శిటీలో నూతన భవనాలు పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి, వీసీ ప్రసన్నశ్రీ

నన్నయ వర్శిటీలో కలెక్టర్ పరిశీలన

రాజమహేంద్రవరం అర్బన్/దివాన్‌చెరువు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నన్నయ వర్శిటీ, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలను మంగళవారం కలెక్టర్ కీర్తి చేకూరి సందర్శించారు. విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల భవనం, పరీక్షల భవనం, కామర్స్‌మేనేజ్మెంట్ స్టడీసప్ స్కూల్ భవనాలను పరిశీలించారు. విశ్వవిద్యాలయం నిధులతో నిర్మించిన భవనాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని వీసీ ప్రసన్న శ్రీ తెలిపారు. విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల భవనం రూ.20.05 కోట్లు, పరీక్షల భవనం రూ.8.25 కోట్లు, స్కూల్ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంట్ భవనం రూ.5.50 కోట్లు, బాలుర వసతిగృహ భవనం రూ.11.10 కోట్లతో నిర్మించామని చెప్పారు. అనంతరం విశ్వవిద్యాలచం అభివృద్ధికి, ప్రగతి కార్యాచరణకు సంబంధించిన పలు అంశాలను తెలిపారు. ఆర్ట్స్ కళాశాల అకడమిక్ ప్రగతి, పరిశోధన వాతావరణం, విద్యార్థుల వినూత్న ఆలోచనలకు అనుకూలంగా ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలపై సమీక్షించారు. ముందుగా ఇంక్యుబేషన్, ఇన్నోవేషన్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ బ్లాకులను పరిశీలించారు. విద్యార్థులు అభివృద్ధి చేసిన ప్రాజెక్టులు, స్టార్టప్ ఆలోచనలు, ఇన్నోవేటివ్ నమూనాలను వీక్షించారు. సీవీ రామన్ అంతర్జాతీయ పరిశోధనా కేంద్రం, నానో టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, రీసెర్చ్ ల్యాబ్‌లు, అక్కడ జరుగుతున్న ప్రయోగాలను పరిశీలించారు. కేంపస్ లైబ్రరీ సందర్శించి మార్క్స్, డార్విన్, న్యూటన్ పుస్తకాల సేకరణ, వాటి పరిరక్షణకు సంబంధించిన విషయాలను కళాశాల అధికారులను అడిగి తెలుసుకున్నారు. కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ భరత్ నారాయణ గుప్త ఆర్ట్స్ కళాశాలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. మంత్రి లోకేశ్ పర్యటన నేపథ్యంలో హడావుడిగా కలెక్టర్ తిలకించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాలల్ రామచంద్ర ఆర్‌కే, ఎన్ఆర్‌సీ కో ఆర్డినేటర్ సంజీవ్, జోన్ 1, 2 ఆర్‌జేడీ పీవీ కృష్ణాజీ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ పర్యటన వాయిదా

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ పర్యటన వాయిదా పడింది.ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరం నగర టీడీపీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో లోకేశ్ పర్యటించాల్సి ఉంది. అయితే ఈ నెల 20న బిహార్ సీఎంగా నితీశ్‌కుమార్ ప్రమాణస్వీకారం చేస్తున్నందున ఆ కార్యక్రమంలో ప్రధాని మోదీతో పాటు నారా లోకేశ్ పాల్గొనాల్సి ఉన్నందున రాజమహేంద్రవరం పర్యటన వాయిదా పడింది.రాజమహేంద్రవరంలో ఆర్ట్స్ కళాశాలలో జరగాల్సిన ప్రారంభోత్సవాలు, విద్యార్థులతో ముఖాముఖి, చెరుకూరిలో జరగాల్సిన నగర్ టీడీపీ సమావేశం, దివాన్‌చెరువు నన్నయ్య యూనివర్శిటీలో జరగాల్సిన కార్యక్రమాలు అన్ని తాత్కాలికంగా వాయిదాపడ్డాయి. త్వరలో ఈ నారా లోకేశ్ పర్యటన ఉంటుందని నగర టీడీపీ కార్యాలయం స్పష్టం చేసింది.

ఆర్ఎంసీకి కేంద్ర జలసంచాయ్ అవార్డు
కమిషనర్‌కు అవార్డు అందజేసిన కేంద్రమంత్రి



అవార్డుతో కమిషనర్ రాహుల్ మీనా

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన 6వ జాతీయ జల అవార్డులు- 2024లో జల్ సంచాయ్ - జన్ భాగీదారీ విభాగం కింద రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు జాతీయ స్థాయిలో నాల్గో ర్యాంక్ వచ్చింది. ఈ సందర్భంగా మంగళవారం ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి చంద్రకాంత్ రఘునాథ్ పాటిల్ చేతుల మీదుగా అవార్డును కమిషనర్ రాహుల్ మీనా అందుకున్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన జల సంరక్షణ పనులకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం గర్వంగా ఉందని కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ మొత్తం 13,298 నీటి సంరక్షణ పనులు పూర్తిచేసి ఈ ఘనత సాధించిందన్నారు. ఈ కేటగిరి కింద లభించిన అవార్డుకు రూ.2 కోట్లు నగదు పురస్కారం లభిస్తుందన్నారు. నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం, వర్షపు నీటిని ఒడిసి పట్ట డం,భూగర్భజలాల పెంపు అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ఈ విజయం సాధించడమైందని కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఈ మాధవి, ఏఈ వెంకటేష్ పాల్గొన్నారు.

కన్నతండ్రి అకృత్యంపై డీఎస్పీ విచారణ



పెరవలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కన్న తండ్రి అకృత్యంపై డీఎస్పీ మంగళవారం విచారణ చేపట్టారు. పెరవలి మండలంలో ఒక గ్రామానికి చెందిన లారీ డ్రైవర్‌కు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అయితే గత మూడేళ్లగా పెద్ద కుమార్తె(17)ను భయపెట్టి అత్యాచారానికి పాల్పడుతున్నాడు.ఇటీవల కుమార్తె కదలికల్లో మార్పు గమనించిన తల్లి అనుమానంతో నిలదీసింది.దీంతో అసలు విషయం బయటపడింది.ఈ నేపథ్యంలో భర్తతో గొడవపడి కుమార్తెను తీసుకుని పెనుమంట్ర మండలం మార్టేరులోని బంధువుల ఇంటికి వెళ్లిపోయింది.వారి సూచన మేరకు గత శనివారం పెనుమంట్ర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆదివారం పెరవలి పోలీస్ స్టేషన్‌కు కేసును ట్రాన్స్‌ఫర్ చేశారు.ఈ కేసుపై కొవ్వూరు డీఎస్పీ ప్రేమ్‌కుమార్ బాలిక గ్రామానికి వెళ్లి మంగళవారం విచారణ చేపట్టారు.స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు : మంత్రి

నిడదవోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని నందిన సుబ్బారావు లీలావతి శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహా త్మాగాంధీ విగ్రహానికి, గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి వెంకటరమణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ప్రజలు మేలుకొలిపే జాతీయ సంపదగా విజ్ఞాన కేంద్రాలుగా విలసిల్లిన గ్రంథాలయాలు భారత స్వరాజ్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, పొన్నా కృష్ణబాబు శర్మ, సుంకవల్లి శ్రీధర్, సొనెపు వెంకట సుబ్బారావు, గ్రంథాలయ అధికారి గద్దె శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలులో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

పారిశుధ్య నిర్వహణలో కార్మికుల పాత్ర కీలకం : చైర్‌పర్సన్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణాన్ని పారిశుధ్య రహిత పట్టణంగా తీర్చిదిద్దడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమైనదని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. పట్టణంలోని జీఎస్‌రావు కాపు కల్యాణ మండపంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు మంగళవారం కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ట్రైనర్ రామారావు ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్య కార్మికుల భద్రత, సంక్షేమంపై శిక్షణ అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ ఇంటింటా చెత్త సేకరణకు వెళ్లే సిబ్బంది ప్రజలకు తడి, పొడిచెత్త, హానికరమైన చెత్త వేరుచేసి అందించడంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌చార్జి ఏ.రవి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కోఆర్డినేటర్ సీతారామాంజనేయరాజు, ప్రదీప్, సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు, మేస్త్రీలు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

సుందర, సోమేశ్వరస్వామికి మాసశివరాత్రి పూజలు

కొవ్వూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వేంచేసియున్న శ్రీబాలాత్రిపుర సుందరిసమేత సుందరేశ్వర స్వామికి మంగళవారం ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. కార్తీకమాసం మాసశివరాత్రిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో సుందర గణేష్ ఆధ్వర్యంలో గణపతిపూజ, లఘున్యాసం సుందరేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, రుద్రహోమం, బాలాత్రిపుర సుందరీ అమ్మవారికి కుంకుమపూజలు చేశారు. అనంతరం భక్తుల సహకారంతో కార్తీక అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే సంస్కృత పాఠశాల ప్రాంగనంలో వేంచేసియున్న శ్రీలలితాపార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు మానేపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలోనూ గణపతిపూజ, లఘున్యాసం సుందరేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, రుద్రహోమం, లలితాదేవికి కుంకుమపూజలు నిర్వహించారు. సాయంత్రం శివ పార్వతుల కల్యాణం, సహస్ర జ్యోతిర్లింగార్చన, మహానీరాజనం సమర్పించారు.

నిడదవోలు: పట్టణంలో వేంచేసివున్న బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి పంచాయతన క్షేత్రంలో మంగళవారం మాసశివరాత్రి సందర్భంగా విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి గణ పతి పూజలు, ఉపన్యాస పూర్వక రుద్రాభిషే కాలు, లక్షబిల్వార్చన జరిగాయి. సాయంకాలం ఆకాశదీపం, మహా నివేదన, నీరాజన మంత్రపుష్పాలు, వేద ఆశీర్వచనాలు చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాకుళపు లక్ష్మీ నరసింహశాస్త్రి, అభిరామ్ ఆధ్వర్యంలో వేద పండితులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి అమ్మవార్లను దర్శించు కుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



సుందరేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న పండితులు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : ఎమ్మెల్యే

తాళ్లపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం బల్లిపాడులో జరిగిన పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ముందుగా పీఎంఏజీవై పథకం ద్వారా కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గ్రామానికి మంజూరైన రూ. 20 లక్షల విలువ గల సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం వేగేశ్వరపురం పాఠశాల వద్ద బైక్ ప్రమాదంలో గాయపడి కాలుకు ఆపరేషన్ జరిగిన ముగ్గురు విద్యార్థునులను వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వారికి గాయాలు నయమయ్యేంత వరకూ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. స్థానిక టీడీపీ నాయకులు కాకర్ల శ్రీనివాస్, కైగాల శ్రీనివాసరావు బాధిత బాలికలకు ఒక్కొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున అందించారు. కార్యక్రమంలో సిద్దా దుర్గారావు, నామన పరమేశ్వరరావు, మద్దుకూరి శంకరం, దుగ్గిరాల జగదీష్, ఉప్పులూరి రమేష్, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్జహన్ తదితర కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ డ్రైన్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎన్టీఆర్ వైద్యసేవ పరిధి లోకి రాని బాధితుల కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా చెక్కులు మంజూరు చేయిస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా సీఎంఆర్ఎఫ్ ద్వారా తిరుగుడుమెట్టకి చెందిన బాధితురాలు మొయ్యేటి అరుణ క్రాంతికి మంజూరైన రూ. 48,291 చెక్కును అందించారు. కార్యక్రమంలో సిద్దా దుర్గారావు, అన్నమరెడ్డి సత్తిబాబు, అన్నమరెడ్డి రమణ, తిగిరిపల్లి గోపి, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే పంగిడి గ్రామ పంచాయతీ పరిధి దేచర్లలో ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్టుమెంటు పీఎంఏజీవై గ్రాంటు ద్వారా మంజూరైన రూ. 20 లక్షలతో నిర్మించే సీసీ డ్రైన్ పనులకు మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకార్ల నారాయుడు, సర్పంచ్ గోశాల నాగార్జున, పొట్రు సిద్దూ, కంటిపూడి శ్రీను, కొప్పాక విజయ్‌కుమార్, వీరమళ్ల నారాయుడు, పీకే రంగారావు, జొన్నా బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు

కొవ్వూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 19 తేదీన గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు క్లీన్ అండ్ గ్రీన్ గ్రామాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో టీబీవీ రమణ తెలిపారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

అచ్చాయమ్మకాలనీలో కార్డన్‌సెర్చ్



కొవ్వూరు అచ్చాయమ్మకాలనీలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కొవ్వూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అచ్చాయమ్మకాలనీలో మంగళవారం కార్డన్‌సెర్చ్ తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ దేవకుమార్ పర్యవేక్షణలో పట్టణ ఎస్‌ఐ పీ.విజయ్‌కుమార్, రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరిరావు ఆధ్వర్యంలో జరిగాయి. ఇందులో భాగంగా పత్రాలు లేని బైక్‌లు, అనుమానాస్పద వ్యక్తుల సంచారం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారి సమాచారంపై ఆరా తీశారు. పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్ల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడి సూచనల మేరకు మందులు వాడాలి

పెరవలి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వైద్యుడి సూచనల మేరకు మందులు వాడాలని డాక్టర్ రాజనాల ప్రసాద్ అన్నారు. మంగళవారం ప్రపంచ యాంటిమైక్రోబియల్ రెసిస్టెంట్స్ వారోత్సవాలు సందర్భంగా పెరవలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోనూ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ తేజశ్రీ, సూపర్‌వైజర్‌లు రాజేష్‌బాబు, ఇతర వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లక్షపత్రి పూజ



లక్ష్మీపురంలో లక్షపత్రి పూజలో పాల్గొన్న భక్తులు

దేవరపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం హరిహర క్షేత్రంలో మంగళవారం కార్తీక మాసం సందర్భంగా ఉదయం నుంచి వివిధ పూజా కార్యక్రమాలు, హోమాలు, అభిషేకాలు చేశారు. అలాగే లక్ష మారేడు దళాలతో పూజ నిర్వహించారు. వేదపండితులు లింగాల శ్రీనివాస్ శర్మ, నవీన్ శర్మ, ప్రవీణ్ శర్మ, పోసుబాబు ఆధ్వర్యంలో జరిగాయి. తర్వాత అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు పాలంగిలో ఉచిత వైద్యశిబిరం

ఉండ్రాజవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాలంగి సొసైటీలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అఖిల భారత సహకార సంఘాల 72వ వారోత్సవాలను పురస్కరించుకుని తమ సొసైటీ వద్ద ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు కాకర్ల నాని మంగళవారం చెప్పారు. ఇందులో జనరల్ వైద్యం, దంతవైద్య నిపుణులు, ఊపిరితిత్తులు, సుగర్ పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ప్రముఖ వైద్యులు సోడిశెట్టి తేజశివకుమార్, పుప్పాల రత్నకమల్‌నాయుడు, కడలి అయ్యప్ప వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. రోగులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కాకర్ల నాని కోరారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : మద్దిపాటి

దేవరపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. యర్నగూడెం శాఖ గ్రంథాలయం వద్ద మంగళవారం 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గ్రంథాలయాన్ని డిజిటల్ గ్రంథాలయంగా తీర్చిదిద్దుతామన్నారు. విద్యార్థులు, యువత గ్రంథాలయం ద్వారా జ్ఞాన సముపార్జన సంపాదించుకోవాలన్నారు. విజ్ఞానం అందించే మరిన్ని పుస్తకాలు కొనుగోలు చేయాలని రూ.10 వేలును విరాళంగా అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనిల్, టీడీపీ నాయకులు, బొల్లిన విజయభాస్కర్, గద్దే శ్రీనివాస్, మండా సుబ్బారావు, బొల్లిన వెంకటేశ్వరరావు, మద్రి వెంకటేష్, బీజేపీ నాయకుడు మండా జనార్దనరావు, జనసేన నాయకులు బళ్లా రామచంద్రరావు, గ్రంథాలయాధికారి అనిత, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రపతాప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న గ్రంథాలయాధికారి అనిత

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

దేవరపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపాలెం హైస్కూల్‌లో టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సబ్ జూనియర్ స్థాయి బాలబాలికల సెలక్షన్స్ జరిగాయి. ఇందులో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఈనెల 21,22 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా సొండిపూడిలో జరిగే క్రీడల్లో పాల్గొంటారని శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ తెలిపారు. టెన్నికాయిట్‌కు ఎం.ప్రియదర్శిని, షేక్ లతిపా, ఆర్. శౌరిక, ఎం. లోహితాశ్రీ, పీ.అక్షయ, బాలురు జీ.బాబి, వై.ఈశ్వర్, చిన్నబాబు, ఆకాశ్, ఎంపికయ్యారు. కార్యక్రమంలో టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు గద్దే చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి ఏవీఆర్ సరస్వతి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు, ఇతరులు

క్రీడాకారుడు రాజశేఖర్‌కు స్వర్ణ పతకం

కొవ్వూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూటాన్ దేశం థింపూలో ఈనెల 14వ తేదీ నుంచి 17 వరకు జరిగిన ఎస్‌బీకేఎఫ్ 12వ ఇంటర్నేషనల్ క్రీడా పోటీలలో గౌరీపట్నంకు చెందిన యువకుడు గెల్లా రాజశేఖర్ స్వర్ణ పతకం సాధించాడు. అంతర్జాతీయ క్రీడాపోటీలలో చెస్ విభాగంలో రాజశేఖర్ ఇండియా తరపున ఆడాడు. అంతకుముందు గోవాలో జరిగిన జాతీయస్థాయి పోటీలలో ద్వితీయ స్థానం పొందాడు. స్థానికులు రాజశేఖర్‌కు అభినందనలు తెలిపారు.

డిజిటల్ గ్రంథాలయాలతో ఉపయోగమే

చాగల్లు, నవరంబరు 18 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ గ్రంథాలయాలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు కే. సుమన్‌కుమార్ అన్నారు. మంగళవారం చంద్రవరం శాఖాగ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో డిజిటల్ లైబ్రరీలు... ఉపయోగాలు అనే అంశంపై చర్చాగోష్ఠి, విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరామచంద్రమూర్తి, గ్రంథాలయ అభివద్ధి కమిటీ కార్యదర్శి కే. వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది కే. ప్రదీప్ కుమార్, ఫణిగోపాలకృష్ణ పాల్గొన్నారు.

నేడు మంత్రి నిమ్మల రాక

దేవరపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గౌరీపట్నంలో బుధవారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం 2వ విడత ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి నియోజక వర్గంలోని నాయకులు, కార్యకర్తలు హాజర వ్వాలని ఆయన కోరారు. మధ్యాహ్నం 1.30 నిమిషాలకు సభ జరుగుతుందన్నారు.

మద్యపానానికి దూరంగా ఉండాలి



తిమన్నపాలెంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నల్లజర్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువత మద్యపానానికి దూరంగా ఉండాలని వెంకట్రామన్నగూడెం వైయస్ఆర్ ఉద్యాన వన వర్సిటీ విద్యార్థులు అన్నారు. మంగళవారం తిమ్మన్నపాలెం, కవులూరులో మద్యపానం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపాలు ఆర్యవైశ్యులు : ఎమ్మెల్యే

కొవ్వూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సేవకు ప్రతిరూపాలు ఆర్యవైశ్యులు అని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని గార్డెన్స్‌లో మంగళవారం ఆర్యవైశ్య కార్తీక వనసమారాధన జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యాపారాలతో పాటు సేవా కార్యక్రమాల నిర్వహణలో ఆర్యవైశ్యులకు మరెవరూ సాటిరారన్నారు. అలాగే పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపం నిర్మాణానికి సంఘం తరపున భూమి చూసుకున్నట్టయితే భవన నిర్మాణానికి ప్రభుత్వ పరంగా నిధుల మంజూరుకు తనవంతు సహకారం అందజేస్తానన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పట్టణ టీడీపీ అధ్యక్షులు అర్జిల్లి రామకృష్ణ, కౌన్సిలర్ బొండాడ సత్యనారాయణ, బావన రాజేష్, బర్ల శ్రీనివాస్‌ను ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షులు నాళం శ్రీనివాసరావు కండువాలు కప్పి, మెమొంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు మట్టే ప్రసాద్, ఎంటీఎస్.ప్రసాద్, కొల్లేపర శ్రీనివాస్, గ్రంధి ప్రవీణ్, కంకటాల రాంబాబు, కాకి అనీల్ సూర్య, కక్కిరాల భద్రరావు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య కార్తీక వనసమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి, పక్కన తదితరులు

● సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

దేచర్ల గ్రామానికి చెందిన తెలగారెడ్డి రామకృష్ణకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 33,332 వేల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అందజేశారు.

వ్యాసరచన పోటీలు

కొవ్వూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కె.సుగుణకుమారి ఆధ్వర్యంలో జూనియర్స్‌కి పుస్తక పఠనం ఆవశ్యకత, సీనియర్స్‌కి డిజిటల్ గ్రంథాలయాల ఆవశ్యకతపై పోటీలు జరిగాయి. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన 20మంది విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పి.వెంకట్, కె.ప్రశాంత్‌కుమార్, బి. రుక్మిణి, రీడర్స్ కె. అంజనేయులు, కె.సాయి కృష్ణ, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ముక్కామల, పెరవలి, తీపర్రు గ్రంథాలయాల్లోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తీపర్రులో జరిగిన కార్యక్రమంలో వడలి వెంకటేశ్వర్లు, కొల్లి శ్రీనివాస్, బి. రవికు మార్, ధనప్రియ, శ్రీదేవి, గ్రంథాలయ అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు. ముక్కామలలో జరిగిన కార్యక్రమంలో పి. విగ్నేశ్వరరావు, కె. మూర్తి, వెంకటరమణ, పట్టాభిరామయ్య, గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కారు, మోటార్ సైకిల్ ఢీ

● ఒకరు మృతి... మరొకరికి తీవ్ర గాయాలు

దేవరపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్‌ను కారు వేగంగా ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కృష్ణపాలెం జాతీయ రహదారి వద్ద మంగళవారం చోటుచేసుకుంది పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి... వాదాలకుంటకి చెందిన కొడమంచిలి లీలాసుభాష్ (19) తన స్నేహితుడు వెదుళ్లకుంట గ్రామానికి చెందిన పులిదిండి మణికుమార్ పల్సర్ బైక్‌పై వెళ్తుండగా ద్వారకా తిరుమల నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు వీరు ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్‌ను వేగంగా ఢీకొనడంతో లీలా సుభాష్ అక్కడిక్కడే మృతిచెందాడు. పులిదిండి మణికుమార్‌ను రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలించారు. లీలా సుభాష్ తాపీ పని చేస్తుంటాడు. మృతునికి తల్లి, తండ్రి, చెల్లి ఉన్నారు. తల్లి దుబాయ్‌లో ఉన్నారు. దీంతో తండ్రి కృష్ణ బోరున విలపిస్తున్నాడు. మృతదేహాన్ని గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

గోపాలపురం: అసలే పేదరికం. ఆపై వెంటాడుతున్న ఆర్థిక ఇబ్బందులు వెరసి ఆ కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేశాయి. సొంతింటి కలను నెరవేర్చుకోవడం కోసం అప్పులు చేసి ఇల్లు నిర్మించుకున్న ఆ కుటుంబానికి కష్టపడటమే ఆయుధంగా మారింది. అప్పులు తీర్చటం కోసం తల్లి వరలక్ష్మి గత జనవరిలో కువైట్ వెళ్లింది. తండ్రి రోజువారీ కూలి చేసి సుభాష్, అతని సోదరిని పోషిస్తున్నాడు. అయితే సుభాష్ 10వ తరగతి పాసై గోపాలపురంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ విద్యాభ్యాసం కోసం వెళ్లాడు. కాగా, వెంటాడుతున్న ఆర్థిక ఇబ్బందులతో ఫీజులు కట్టలేక చదువును మధ్యలో నిలిపివేశాడు. దీంతో చేసేదేమి లేక స్నేహితులతో కలిసి తాపీ పనికి వెళ్తుండేవాడు. తన తాత సుబ్బారావు అనారోగ్యం కారణంగా మందులు తీసుకురమ్మని చెప్పడంతో వెదుళ్లకుంటలోని తన స్నేహితుడు మణికుమార్‌తో కలిసి ద్విచక్ర వాహనం పై వెళ్లిన కొంత సేపటికి ప్రమాదంలో మృతి చెందాడు.

యర్నగూడెంలో అయ్యప్పలకు సత్కారం

దేవరపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్ష చేపట్టి ఇరుముడి కట్టుకుని శబరిమల అయ్యప్ప సన్నిధికి 1640 కిలోమీటర్లు పాదయాత్ర చేసి దైవదర్శనం చేసుకుని వస్తున్న స్వాములను యర్నగూడెం అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప మందిరం వద్ద మంగళవారం చిరుసత్కారం చేశారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పీ. మల్లవరం గ్రామానికి చెందిన కాట్నం శ్రీనివాస్ గురుస్వామి, పీ.రామారావు స్వాములను యర్నగూడెం అయ్యప్పలు సత్కరించారు. కార్యక్రమంలో యర్నగూడెం అయ్యప్ప సేవా సమితి సభ్యులు బళ్లా రవికుమార్, నరహరశెట్టి అంజిబాబు, బీ.బాలబ్రహ్మానందం, బళ్లా రాము, తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న వారిని సత్కరిస్తున్న దృశ్యం

మహిళ ఆత్మహత్యాయత్నానికి కారకులైన ముగ్గురిపై కేసు

కొవ్వూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అధిక కట్నం కోసం వేధిస్తున్న భర్త, అతని బంధువులపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఎస్‌ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం రాజమహేంద్రవరం కొంతమూరు భవానిపురానికి చెందిన మాగాపు పుల్లారత్నం కుమార్తె అరుణను, కొవ్వూరుకు చెందిన ఎలుబండి వెంకటసత్యనారాయణకు ఇచ్చి వివాహం చేశారు. కాగా, అరుణను అధికకట్నం కోసం అత్త, మరిది, భర్త వేధింపులకు గురిచేయడంతో ఈనెల నాలుగో తేదీన ఇంట్లో ఉరి పోసుకుని ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. దీంతో కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అరుణ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె తల్లి పుల్లారత్నం అందించిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

తహశీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ధర్నా

నిడదవోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సామాజిక న్యాయం, ఆత్మగౌరవం నినాదంతో సీపీఐ ఇచ్చిన పిలుపు మేరకు ధర్నా నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మాముదూరి నాగేంద్ర వరప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద రాష్ట్ర నాయకుడు రేఖా భాస్కరరావు ఆదేశాలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చిన ఈ 11 సంవత్సరాల కాలంలో దేశంలో దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. ధర్నా అనంతరం తహశీల్దార్ నాగరాజు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో క్రొవ్విడి నాగరాజు, గన్నాబత్తుల సత్యానారాయణ, మొయిలి శ్రీను, రామిశెట్టి సత్తిబాబు, బేజా అప్పారావు, కోసూరి శ్రీను, రొంగల శ్రీను, మామిడి సన్యాసిరావు, కాకి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు